PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 131 | విజయవాడ, సోమవారం 12 డిసెంబర్ 2022 | 6+8 పేజీలు వెల : రూ. 5. 50
Vol No | Vijayawada, Monday 12 December 2022 | Rs



సుప్రీం జడ్జిగా జస్టిస్ దీపాంకర్ దత్తా

లోపలి పేజీలో..



హిమాచల్‌ప్రదేశ్ సిఎంగా సుఖ్వీందర్ సింగ్ సుఖుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ రాజేంద్ర అర్లేకర్

హిమాచల్ గద్దెపై సుఖ్వీందర్

- ఉప ముఖ్యమంత్రిగా ముఖేష్ అగ్నిహోత్రి ప్రమాణ స్వీకారం

లోపలి పేజీల్లో

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ కాలపరిమితిని పొడిగించండి

ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళిత గిరిజన ప్రజలకు జనాభా ప్రాతిపాదికన నిధులు కేటాయించేందుకు 10 సంవత్సరాల కాలపరిమితితో 2013లో తెచ్చిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం గడువు 2023 మార్చితో ముగియనున్నందున ఈ చట్టం కాలపరిమితిని పెంచేందుకు వీలుగా చట్టసవరణ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆదివారంనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. దళిత, గిరిజనులకు జనాభా ప్రాతిపాదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించి, వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరుతూ ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున ఉద్యమించిన ఫలితంగా అప్పటి ప్రభుత్వం ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం2013ను 10ఏళ్ల కాలపరిమితితో తీసుకొచ్చిందని అన్నారు. 2015 వరకు ఈ చట్టం అమలుకు సంబంధించి నియమ నిబంధనలు లేకపోవడంతో దీని అమలులో ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. 2015 తర్వాత ఈ చట్టానికి లోబడి జనాభాప్రాతిపాదికన నిధులను కేటాయిస్తూ వచ్చారని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రణాళికాసంఘాన్నే రద్దుచేయడంతో దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులకు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రణాళికాబద్ధ అభివృద్ధి ఆగిపోయి అపారమైన నష్టం జరిగిందన్నారు. ప్రణాళికాసంఘాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. 2017నుండి నీతి అయోగ్ నిబంధనల మేరకు ఎస్‌సి కాంపొనెంట్ పేరుతో నిధులను కేటాయించడం మొదలుపెట్టారని అన్నారు. కేంద్రబడ్జెట్‌లో కేంద్రపథకాలు, కేంద్రం స్పాన్సర్ చేసే పథకాలకు నిధులు ఇచ్చేవారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే బడ్జెట్‌కు అనుగునంగా తనవాటా నిధులను కేటాయిస్తే ఆమేర దళితులకు, గిరిజనులకు పథకాలు మిగతా 3లో



గుంటూరు జిల్లా తెనాలి మండలంలో ఓదెలపై తడిసిన వరిని చూపుతున్న రైతు

రైతన్న విలవిల

- 'మాండూస్' దెబ్బకు అపార పంట నష్టం
- వరి, పత్తి, మిర్చి పంటలపై తీవ్ర ప్రభావం
- నష్టం అంచనాల్లో అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- యంత్రాంగం

మాండూస్ తుపాను దెబ్బకు రైతు వెన్ను విరిగింది. వరి, పత్తి, మిర్చి తదితర పంటలకు అపార నష్టం వాటిల్లింది. చేతికి వచ్చిన పంట పాడైపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పంట నష్టాల అంచనాల్లో అధికార యంత్రాంగం ఉంది. బాపట్ల జిల్లా కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని రేపల్లె, బాపట్ల వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో వర్షాలకు ముందు కోసి అరబెట్టిన 30 వేల ఎకరాల్లోపైగా వరి కంకులు నీట మునిగాయి. మాగాణి భూముల్లో కోసిన వరి ఓదెలు నీటిపై తేలియాడుతున్నాయి. మరో 40 వేల ఎకరాల్లో వరి వరి పైరు గాలులకు ఒరిగిపోయింది. పత్తి, మినుము, మిర్చి, పసుపు, ఉద్యాన పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రకాశం జిల్లాలో సాగర్ ఆయకట్టులో కోసిన వరి ఓదెలు తడిచి ముద్దయ్యాయి. త్రిపురాంతకం, దర్శి, తాళ్లూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. వరి ధాన్యం తడిచిపోవడంతో రంగు మారే ప్రమాదం ఉంది. పశ్చిమ ప్రాంతంలో మిర్చి పంట దెబ్బతినిపోయింది. దోర్నాల, పెద్దారవీడు ప్రాంతాల్లో మిర్చి తోటల్లో నీరు చేరి కాయలు రాలిపోయాయి.

మినుము, బొబ్బర్లు, పొగాకు పంటకూ నష్టం వాటిల్లింది. కడప జిల్లాలోని 35 మండలాల్లో, అన్నమయ్య జిల్లాలోని ఏడు మండలాల్లో మొత్తం 9,001 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కడప జిల్లాలో పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, బి.మఠం, కాశినాయన, బద్వేల్, గోపవరం, అట్లూరు, సిద్ధవటం, ప్రొద్దుటూరు, పెద్దముడియం, మైదుకూరు, చాపాడు, వి.ఎన్‌పల్లి, వల్లూరు మండలాల్లోని సుమారు 30 రకాల పంటలపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. 4,387 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 2,062 ఎకరాల్లో బుడ్డశనగ, 1,042 ఎకరాల్లో వరి, 1,235 ఎకరాల్లో జొన్న పంటలు నేలకొరిగాయి.

141.5 ఎకరాల్లో పండ్ల తోటలపై ప్రభావం చూపించింది. అరటి, ఉల్లి, టమోటో పంటలకు నష్టం వాటిల్లింది. అన్నమయ్య జిల్లాలో మదనపల్లి, పీలేరు, రాజంపేట, లక్కిరెడ్డిపల్లి, మదనపల్లి, నిమ్మనపల్లి, కొరబాలకుంట, బి.కొత్తకోట, పెనగలూరు, రామాపురం మండలాల్లో వరి దెబ్బతింది. తుపాను తాకిడి ఎక్కువగా మిగతా 5లో

రూ.2 వేలు సాయం

తుఫాన్ వల్ల తీవ్ర నష్టం వాటిల్లిన నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, ప్రకాశం జిల్లాల్లోని బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని విడుదల చేసింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువరించింది. వ్యక్తికి రూ.వెయ్యి చొప్పున, కుటుంబానికి గరిష్టంగా రూ.2 వేలు సహాయాన్ని ప్రకటించింది. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లేటప్పుడు ఈ ఆర్థిక సహాయం అందించాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

కవితను విచారించిన సిబిఐ

- 'లిక్కర్ స్కాం' పై ఆరా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ఢిల్లీ లిక్కర్ స్కాంలో నిందితులతో సంబంధాలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సిబిఐ బృందం ప్రశ్నించింది. గుజరాత్‌కు చెందిన వ్యాపారి, లిక్కర్ స్కాంలో అరెస్టయిన అమిత్ అరోరాతో కవితకు ఆర్థిక లావాదేవీలపై సిబిఐ అధికారులు ఆరా తీశారు. విచారణ సందర్భంగా అరోరా ఇచ్చిన వాంగ్మూలంలో పలుసార్లు కవిత పేరు ప్రస్తావించిన నేపథ్యంలో ఆమెను సిబిఐ అధికారులు ఆదివారం విచారించారు. ఉదయం 11 గంటలకు మూడు వాహనాల్లో రెండు బృందాలుగా కవిత ఇంటికి వచ్చారు. రాత్రి ఏడు గంటల వరకు పలు అంశాలపై ప్రశ్నించారు. కవిత స్టేట్‌మెంట్‌ను వీడియో రికార్డు చేసినట్లు తెలిసింది. కవిత కుటుంబం వ్యాపారాలు, ఢిల్లీ పర్యటనలు, నిందితులతో పరిచయం, వ్యాపార లావాదేవీలపై సిబిఐ ఆరా తీసింది. లిక్కర్ స్కాం వెలుగులోకి వచ్చిన తర్వాత పది ఐఫోన్లను ధ్వంసం చేసినట్లు గుర్తించిన సిబిఐ దానిపై వివరణ కోరింది. నిందితుడు అరోరా నుంచి విజయనాయర్‌కు రూ.100 కోట్లు బదిలీ అయిన వ్యవహారంపై కూడా కవితను ప్రశ్నించినట్లు తెలిసింది. సిబిఐ ప్రశ్నలకు కవిత లిఖిత పూర్వకంగా సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. సిబిఐ విచారణ నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని ఆమె ఇంటి పరిసరాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇతరులు ఎవరినీ అటువైపు అనుమతించలేదు. విచారణ అనంతరం సిబిఐ అధికారులు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతానికి విచారణ ముగిసిందని, అవసరమైతే మళ్లీ నోటీసులు ఇచ్చి విచారణకు పిలుస్తామని చెప్పారు. సిబిఐ బృందాలు వెళ్లిపోయిన తర్వాత కవిత ఇంటికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే కాంత్రికిరణ్, పలువురు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమె వారికి అభివాదం చేశారు. అనంతరం ప్రగతి భవన్‌కు వెళ్లి సిఎం కెసిఆర్‌ను కలిశారు. సిబిఐ విచారణ తీరును ఆయనకు వివరించారు. కాగా, 31 సిఆర్‌పిసి కింద కవితకు సిబిఐ అధికారులు మళ్లీ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. తామడిగిన సమాచారానికి సంబంధించి సాక్ష్యాధారాలతో సహా తాము సూచించిన వద్దకు విచారణకు కావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది.



సర్వం సిద్ధం

- విజయనగరంలో నేడు, రేపు ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ

విజయనగరంలోని కూడళ్లలో యూనియన్ జెండాలను అలంకరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాలుగో రాష్ట్ర మహాసభ సోమ, మంగళవారాల్లో విజయనగరంలోని ఎస్.కన్వెన్షన్ హాలులో జరగనున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. తొలిరోజు విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి గురజాడ కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం కళాక్షేత్రంలో బహిరంగ సభ జరగనుంది. బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరు కానున్నారని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి తెలిపారు. మధ్యాహ్నం నుంచి ప్రతినిధుల సభ ప్రారంభం కానుందని చెప్పారు. నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలు సమీక్షించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకోనున్నామని తెలిపారు. రెండో రోజు నూతన కార్యవర్గం ఎన్నిక జరగనుందని చెప్పారు. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి.

ప్రదర్శన జరిగే రోడ్డు, జిల్లా కోర్టు నుంచి ప్రతినిధుల సభ జరిగే ఎస్ కన్వెన్షన్ హాలు వరకూ యూనియన్ జెండాలతో అలంకరించారు. సిఐటియు, ఆటో, రిక్షా, ముఠా, భవన నిర్మాణ కార్మిక సంఘాలతోపాటు ఎస్‌ఎఫ్‌ఐ, కార్మిక, ప్రజా సంఘాలు మహాసభ ఏర్పాట్లకు సహకరిస్తున్నాయి. రాజకీయ జోక్యం పెచ్చుమీరడంతో ఆశా వర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిభారం పెరిగింది. కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్లతో యూనియన్ పోరాడుతోంది.

గుజరాత్ ఆప్ ఎమ్మెల్యేలకు బిజెపి గాలం

- విసవదర్ ఎమ్మెల్యే చేరిక ఖరారు!

అహ్మదాబాద్ : ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ టిక్కెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలకు బిజెపి గాలం వేస్తోంది. గుజరాత్‌లో ఆప్ తరపున ఐదుగురు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన సంగతి తెలిసిందే. వీరిలో జునాగఢ్ జిల్లా విసవదర్ నియోజకవర్గ ఎమ్మెల్యే భూపత్ భయాని బిజెపిలో చేరడం ఖాయమని సమాచారం. ఇప్పటికే ఆయనతో బిజెపి నేతలు సంప్రదింపులు పూర్తి చేసినట్టు తెలిసింది. మిగిలిన ఆప్ ఎమ్మెల్యేలతో కూడా బిజెపి నాయకులు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. బిజెపిలో చేరతానని వస్తున్న వార్తలు భూపత్ భయాని ఖండించారు. బిజెపిలో చేరే విషయంపై ప్రజల అభిప్రాయం తీసుకుంటానని తెలిపారు. ఆదివారం రాత్రి ఒక మీడియా సంస్థతో భూపత్ భయాని మాట్లాడుతూ 'నేను బిజెపిలో చేరడం లేదు. బిజెపిలో చేరాలా.. వద్దా.. అని ప్రజలను అడుగుతాను' అని తెలిపారు. తక్కువమంది ఎమ్మెల్యేలతో ప్రతిపక్షం బలహీనంగా మారిందని, ఎమ్మెల్యేగా ప్రతిపక్షంలో కూర్చుని తనకు ఓటు వేసిన ప్రజలకు ఏమీ చేయలేనని చెప్పు కొచ్చారు. తన నియోజకవర్గంలో రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని వారి



ఆప్ ఎమ్మెల్యే భూపత్ భయాని

సమస్యలు పరిష్కరించాల్సి ఉందని అన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం గురించి ప్రశ్నించగా భయాని తోసిపుచ్చారు. 'భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రజల కోసం పనిచేయడం నా హక్కు' అని చెప్పారు. గుజరాత్‌లో విజయం సాధించిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులను చేర్చుకునేందుకు బిజెపి ఇప్పటికే ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గుజరాత్‌లో భారీ మెజారిటీతో బిజెపి విజయం సాధించినప్పటికీ, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేయడం గమనార్హం.

భారత ఉజ్వల భవిష్యత్తు బాలల చేతుల్లోనే

- మంత్రి రోజా
- ఘనంగా ముగిసిన 30వ రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్

ప్రజాశక్తి- గూడూరు రూరల్(తిరుపతి)

తిరుపతి జిల్లా గూడూరులోని ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండో రోజుల పాటు జరిగిన 30వ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి శాస్త్రీయ ప్రాజెక్ట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ, సికే.దాస్ అకాడమీ చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కందుకూరు, ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గూడూరు వారి సంయుక్త సహాయసహకారాలతో ఈ పోటీలను నిర్వహించారు. శాస్త్రీయ ప్రాజెక్టు పోటీలలో రాష్ట్రంలోని 26 జిల్లాల బాలశాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, యువజన అభ్యున్నతి శాఖ మంత్రి ఆర్‌కె రోజా పాల్గొని మాట్లాడారు. 30వ బాలల సైన్స్ కాంగ్రెస్‌కి వచ్చిన బాల శాస్త్రవేత్తలకు, వారిని తయారు చేసిన ఉపాధ్యాయులకు కార్యక్రమ నిర్వహణలో కీలకపాత్ర పోషించిన ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి మెంబర్ సెక్రటరీ డాక్టర్ అపర్ణకి, సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యలేని వాడు వింతపశువు... విద్య ప్రతి ఒక్కరికి అవసరం... విద్యా, వైద్యాన్ని ప్రతి ఒక్కరికి అందించాలనేది లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నోకార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న మంత్రి రోజా

ఈ పోటీల ద్వారా సైన్స్ పట్ల ఆకర్షితులు అవ్వాలనేది ముఖ్యఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమ క్రియేటివికి పదును పెట్టి దాదాపుగా 182 ప్రాజెక్టులను తయారు చేశారు. వాటిలో 17 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వాటిని రూపొందించినవారిని అభినందించారు.

ఎంపిక కాబడిన ప్రాజెక్టులను జాతీయ స్థాయికి వెళ్తాయని తెలిపారు. విద్యార్థులు మరింతగా మేధస్సును పదునుపెట్టాలని, ఆంధ్ర స్టూడెంట్స్ ఆషామాషీ కాదని, అద్భుతమైన స్కిల్స్ వారి సొంతమని విద్యార్థులను ప్రోత్సహించారు. ఆడపిల్లలకు ఎప్పుడూ తను సపోర్టుగా ఉంటానని తెలిపారు. అనంతరం గెలిచిన విద్యార్థులను అభినందించి బహుమతి, సర్టిఫికెట్, మెడల్‌లు బహూకరించారు. కార్యక్రమంలో ఆదిశంకర కాలేజ్ చైర్మన్ పెంచలయ్య, జడ్‌పి చైర్‌పర్సన్ అనం అరుణమ్మ, సైన్స్ సిటి డాక్టర్ కె జయరాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి శేఖర్, అప్‌కాస్ట్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీర్లపై దుష్ప్రచారం తగదు : మంత్రి అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాలనకు చేదోడువాదోడుగా వుంటూ ప్రజలకు సేవలను అందిస్తున్న గ్రామ, వార్డు వాలంటీర్లపై దుష్ప్రచారం చేయడం తగదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారంనాడు తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను పట్టిపీడించాయని, యథేచ్ఛగా దోచుకునేందుకే అప్పట్లో ఆ కమిటీలు పని చేశాయని ఆయన ఆరోపించారు. కానీ తాము నియమించిన వాలంటీర్లు ప్రజలకు అతి చేరువగా వుంటూ సేవలందిస్తున్నారని తెలిపారు. లంచాలకు అవకాశం లేకుండా ప్రతినెల ఒకటో తేదీన ఇంటికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్నారని అన్నారు. వాలంటీర్ వ్యవస్థను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కొనియాడుతుంటే ఓర్వలేక అబద్ధాలతో టిడిపి దుష్ప్రచారం చేయిస్తోందని విమర్శించారు. చంద్రబాబు హయాంలో 39 లక్షల మందికే పెన్షన్లు వుంటే తమ ప్రభుత్వం 42 లక్షల మందికి పైగా పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. వాలంటీర్లు తప్పు చేస్తే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలే తప్ప.. వారి సేవలను కించపరిచేలా దుష్ప్రచారం చేయొద్దని సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ ఆలస్యానికి కూడా చంద్రబాబే కారణమని అంబటి పేర్కొన్నారు.

మందులు కొనుగోలులో అవకతవకలు జరగలేదు

ఎండి మురళీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆసుపత్రులకు మందుల కొనుగోళ్లలో ఎటువంటి అవకతవకలు జరగలేదని ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఎపిఎంఎస్ఐడిసి) మేనేజింగ్ డైరెక్టర్ ఎం.మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్.ధర కంటే 500శాతం అధికంగా ఇచ్చి కొనుగోలు చేశామనడం సరికాదని అన్నారు.. రెండేళ్లలో రూ.100కోట్ల మేర విక్రయాలు జరిగాయనడం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌ల ద్వారా కానీ ఎపిఎంఎస్ఐడిసి ద్వారా కానీ ఇప్పటి వరకు ఎటువంటి చెల్లింపులు జరగలేదని ఆయన వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా అజయ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (361/2020) నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ అజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. తాడేపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సంఘం అత్యవసర సమావేశం ఆ సంఘం అధ్యక్షులు గునిపె రాజేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన షేక్ అబ్దుల్ రజాక్ సంఘానికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయనకు బదులు శ్రీరామ అజయ్‌కుమార్‌ను నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై సమావేశం పలు తీర్మానాలు చేసిందన్నారు. సచివాలయ ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రమోటెడ్ గ్రేడ్-2 విఆర్‌ఓలకు రెండు సంవత్సరాల ఆరు నెలలు సర్వీసు పూర్తి కావస్తున్నందున వెంటనే ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియను పూర్తి చేయాలని, గ్రేడ్-1 పే స్కేలు కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు. జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, విఆర్‌ఓ, గ్రామ సర్వేయర్లకు రీ- సర్వే టార్గెట్‌లు ఇవ్వకుండా వత్తిడిని తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి పాండురంగ, గుంటూరు జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, రాయలసీమ జిల్లాల కో ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

తెలంగాణలో జనసేన పోటీ !

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన పార్టీ తెలంగాణ కార్యవర్గం కసరత్తు చేస్తోంది. తెలంగాణలో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఇటీవల పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి నేమూరి శంకర్‌గౌడ్ స్పష్టం చేశారు. పవన్ ఆదేశాల మేరకు ప్రస్తుతానికి 32 నియోజకవర్గాల్లో కార్యనిర్వాహకులను ఎంపిక చేసినట్టు ఆదివారం ఆయన వెల్లడించారు. వీరంతా వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో పర్యటించి నివేదిక అందజేస్తారని, ఆ నివేదిక ఆధారంగా ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. ఎన్నికల ప్రచారం కోసం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన వాహనం రిజిస్ట్రేషన్‌కు రవాణా శాఖ అభ్యంతరం తెలిపినట్లు సమాచారం.

మహాసభకు అత్యంత ప్రాధాన్యత

- సంక్షుభిత, సంక్లిష్ట పరిస్థితుల్లో ఉద్యమాలకు రూపకల్పన
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్‌లో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభకు అత్యంత ప్రాధాన్యత ఉందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను తెలిపారు. మహాసభల నేపథ్యంలో హైదరాబాద్ వచ్చిన ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఒకవైపు కార్పొరేటీకరణ, మరోవైపు మతోన్మాదం చెలరేగుతున్న ప్రస్తుత తరుణంలో దేశంలో అత్యంత సంక్షోభిత, సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో వివిధ విద్యార్థి సంఘాలన్నింటిని ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఐక్య ఉద్యమాలకు రూపకల్పన చేయాల్సిన అవసరముందని చెప్పారు. అందుకనుగుణంగా మహాసభలో పలు తీర్మానాలు రూపొందించి ఆమోదిస్తామన్నారు. నూతన విద్యావిధానంతో రాబోయే రోజుల్లో పేద పిల్లలే కాదు.. మధ్య తరగతి వారు సైతం ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. ఇదే జరిగితే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో అడుగు పెట్టలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడాన్కి వ్యతిరేకంగా బలమైన ఐక్య ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. విద్యారంగాన్ని కాపాడేందుకు ప్రజలు, మేధావులు, విద్యావేత్తలు, ఆ రంగానికి సంబంధించిన నిపుణులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధాలను సవరించాలి

యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ బదిలీలకు ఇచ్చిన జివో 187లో ఉన్న అసంబద్ధాలను సవరించి బదిలీలు చేపట్టాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఆదివారం జరిగింది. ఏ పద్ధతిలో సర్దుబాటు జరిగినా ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించాలని వారు కోరారు. 98 రోల్‌పైన ఉన్న యుపి పాఠశాలల్లో కదిలిస్తున్న ఎస్‌జిటిలకు, ఎస్ఎలకు ప్రత్యేక పాయింట్లు కేటాయించాలని కోరారు. గత బదిలీల సందర్భంగా ఉపాధ్యాయులకు ఉన్న ఆరోగ్య వెసులుబాటు సౌకర్యాలకు ప్రాధాన్యత కేటగిరీగా పరిగణించాలని తెలిపారు. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేక పాయింట్లు కొనసాగించాలని కోరారు. 92 లోపు రోల్ ఉన్న ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, పిఇటిలకు స్పెషల్ పాయింట్లు కేటాయించాలని తెలిపారు. సబ్జెక్టు కన్వర్షన్ అయిన వారిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఖాళీలను బ్లాక్ చేయవద్దని, ఉపాధ్యాయుల వాస్తవిక సమస్యల గ్రీవెన్సీలను తప్పక పరిగణలోకి తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ రూపొందించి బదిలీలు, పదోన్నతులు వెంటనే నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి బి గోపిమూర్తి, కార్యదర్శులు బి లక్ష్మిరాజా, ఎ కృష్ణసుందరరావు, ఎస్‌పి మనోహర్ కుమార్, డివి రాఘవులు, ఎన్ నవ కోటేశ్వరరావు, ఎస్ఎస్ నాయుడు, వి కోటేశ్వరప్ప, ఎన్ అరుణకుమారి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎన్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి షర్మిల దీక్ష భగ్నం

అపోలో ఆస్పత్రికి తరలించిన పోలీసులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దీక్షను శనివారం అర్ధరాత్రి పోలీసులు భగ్నం చేశారు. దీక్ష కొనసాగిస్తే ఆరోగ్యం క్షీణించి ప్రమాదకర పరిస్థితిలోకి వెళ్లే అవకాశం ఉందన్న వైద్యుల సూచనతో పోలీసులు శనివారం అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ఆమెను లోటస్‌పాండ్ నుంచి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి తరలించారు. పాదయాత్రకు అనుమతి నిరాకరించినందుకు నిరసనగా గత రెండ్రోజులుగా హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో షర్మిల దీక్ష చేస్తున్న విషయం విదితమే. షర్మిల ఆరోగ్య పరిస్థితిపై అపోలో వైద్యులు ఆదివారం మధ్యాహ్నం హెల్త్ బులిటెన్ విడుదల చేశారు.

బిపి, బలహీనత పరిస్థితిలో షర్మిలను ఆస్పత్రిలో చేర్పించారని వైద్యులు తెలిపారు. షర్మిలకు డీహైడ్రేషన్, ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్, తీవ్రమైన ఒలిగురియా, అధిక అయాన్ గ్యాప్ మెటబాలిక్ అసిడోసిస్, ప్రీ-రీనల్ అజోటెమియా ఉన్నాయని చెప్పారు. సోమవారం మరోసారి పరీక్షలు నిర్వహించిన తర్వాత డిశ్చార్జిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో షర్మిలకు రెండు మూడు వారాలు పూర్తి విశ్రాంతి అవసరమని చెప్పారు. అపోలో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న షర్మిలను ఆమె తల్లి విజయమ్మ, కుటుంబ సభ్యులు పరామర్శించారు.


కొత్తపట్నం ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు

సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు క్షేమం

ప్రజాశక్తి-కొత్తపట్నం (ప్రకాశం జిల్లా)

చేపలవేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకుపోయిన మత్స్యకారులు ఆదివారం సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన మత్స్యకారులు గరికన కృష్ణ, మెరుగ ప్రసాద్, శివ, దాసరి పంపోచి, పొక్కల మహేష్, వంగిరి మల్లి, మరద పోల్ ఈ నెల 4న సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో బయటకు రాలేక శనివారం కుటుంబ సభ్యులకు, అధికారులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు కొత్తపట్నం తీరం వద్ద మత్స్యకారులు ఉన్నట్టు గుర్తించారు. ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయంతో పోలీసులు ప్రత్యేక బోటులో మత్స్యకారులను సురక్షితంగా కొత్తపట్నం సముద్ర తీరానికి తీసుకువచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల అనంతరం వారి స్వగ్రామమైన వాడరేవుకు పంపించారు.

పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపి అక్రమాలు

- శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పట్టభద్రుల ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసిపి భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 50 వేలకు పైగా బోగస్ ఓటర్లను ఆ పార్టీ ఓటర్ల జాబితాలో చేర్పించిందని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున జరిగిన అక్రమాలను ఎన్నికల సంఘం తక్షణమే అడ్డుకోవాలని యనమల కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే వ్యక్తి పేరు రెండు, మూడు సార్లు నమోదు అవడం, ఐదో తరగతి, పదో తరగతి, ఇంటర్ చదివిన వారిని కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితాలో చేర్చి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, వాలంటీర్లకు లక్ష్యాలు పెట్టి మరి అనర్హులతో ఓటర్ల జాబితా నింపేశారని ఆరోపించారు. వైసిపి అక్రమాలకు సహకరించి అధికారులు బలికావొద్దని ఆయన సూచించారు. అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. మేధావులు, విద్యా వంతులు పాల్గొనే ఎన్నికలను కూడా ప్యూడల్ ధోరణితో ప్రజాతీర్పును కొల్లగొట్టాలని చూస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గ పరిధిలో దాదాపు 10 వేల మందికి పైగా అనర్హులను ఓటర్ జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. కడప, అనంతపురం, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజవవర్గాల పరిధిలోనూ భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు.

అధికార పార్టీ తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎన్నికల సంఘం నిబంధనలను భేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వాలంటీర్లను ఎన్నికల విధుల్లో ఉపయోగించవద్దని ఎన్నికల సంఘం ఆదేశాలున్నా వైసిపి లెక్కచేయడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రం మొత్తంలో దాదాపు 50 వేల బోగస్ ఓట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం వెంటనే బోగస్ ఓట్లను గుర్తించి వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా కట్టడి చేయాలని, లేదంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్లకు నిరాశ

- టిక్కెట్ రాయితీల పునరుద్ధరణకు రైల్వే నిరాకరణ
- రాయితీని 'ఆదాయ నష్టం'గా పేర్కొన్న వైనం

న్యూఢిల్లీ : దేశంలో రైలు టిక్కెట్లలో సీనియర్ సిటిజన్లకు రాయితీలను పునరుద్ధరిస్తారనే ఊహాగానాలకు కేంద్రం తెర దించింది. రాయితీల పునరుద్ధరణ అవకాశాన్ని భారతీయ రైల్వే స్పష్టంగా తోసిపుచ్చింది. ఇది దేశంలోని సీనియర్ సిటిజన్లకు నిరాశను మిగిల్చింది. కోవిడ్‌కు ముందు, 58 ఏండ్లు పైబడిన మహిళా ప్రయాణికులు, 50 శాతం ఛార్జీల తగ్గింపునకు అర్హులు. 60 ఏండ్లు పైబడిన పురుషులు 40 శాతం ఛార్జీల తగ్గింపునకు అర్హులు. గరీబ్ రథ్, గతిమాన్ ఎక్స్‌ప్రెస్, సువిధ, హమ్‌సఫర్ ట్రైన్‌లు తప్పా మిగతా అన్ని రైళ్లకు ఈ మినహాయింపు వర్తిస్తుంది.రైలు టిక్కెట్లలో సీనియర్ సిటిజన్లకు రాయితీల పునరుద్ధరణపై రైల్వేస్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసుల స్థితిని కోరుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త చంద్ర శేఖర్ గౌర్ దాఖలు చేసిన దరఖాస్తుకు రైల్వే సమాధానమిచ్చింది.

"స్టాండింగ్ కమిటీ సిఫారసులను సముచితంగా పరిశీలించిన తర్వాత, 2019-20లో అన్ని ప్యాసింజర్ టిక్కెట్లపై రూ. 59,837 కోట్ల సబ్సిడీని భారతీయ రైల్వే ఇచ్చింది. మొత్తం టిక్కెట్ ధరలో ఇది 53 శాతం. వికలాంగులు, రోగులు, విద్యార్థులకు రాయితీ ఇప్పటికే అమలులో ఉన్నది" అని తెలిపింది. రైల్వే మంత్రిత్వ శాఖ, 2020 మార్చి 19 కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో, సీనియర్ సిటిజన్‌లతో సహా (నాలుగు కేటగిరీల దివ్యాంగులు, 11 కేటగిరీల రోగులు మినహా) వివిధ వర్గాలకు రైలు టిక్కెట్‌లపై ఇచ్చిన అన్ని రాయితీలను ఉపసంహరించుకుంటూ సర్క్యులర్ జారీ చేసింది. అయితే, కోవిడ్-19 ఆక్షలు సడలించి నెలలు గడిచినప్పటికీ రాయితీని పునరుద్ధరించకపోవటంతో పార్లమెంటులో సభ్యులు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. 2022లో పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆ సమయంలో "సీనియర్ సిటిజన్లకు రాయితీలను తిరిగి ప్రారంభించటం ప్రభుత్వానికి సాధ్యం కాదు" అని వెల్లడించటం గమనార్హం.

అయితే, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ ఏడాది ఆగస్టు 4న తన నివేదికను సమర్పించిన తర్వాత స్లీపర్, 3ఏసీ ప్రయాణికులకు సీనియర్ సిటిజెన్స్‌కు కేంద్రం రాయితీని పునరుద్ధరిస్తుందన్న ఆశలు పెరిగాయి. రైల్వేలు సాధారణ స్థితికి చేరుకుంటున్నందున వివిధ వర్గాల ప్రయాణికులకు మంజూరు చేసిన రాయితీలను న్యాయంగా పరిశీలించాలని కమిటీ సిఫారసు చేసింది. అయితే, రాయితీలను పునరుద్ధరించే ఆలోచన లేదని ఆర్టీఐ ప్రశ్నకు రైల్వేశాఖ సమాధానాన్ని వెల్లడించటం గమనార్హం. తమ నిర్ణయాన్ని సమర్థించుకోవటం కోసం రైల్వే రాయితీని 'ఆదాయ నష్టంగా' పేర్కొనటం గమనార్హం. ప్రయాణికుల టిక్కెట్ల రాయితీ కారణంగా రైల్వేలు సాధారణంగా ఏడాదికి సగటున రూ. 1800 కోట్లు నష్టపోతున్నాయని వాదించింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వే 7.3 కోట్ల మంది సీనియర్ సిటిజెన్లకు రాయితీని కల్పించింది. 2020-21 నాటికి అది 1.90 కోట్లకు పడిపోయింది. అయితే, 2022 ఆర్థిక సంవత్సరంలో ఇది 5.5 కోట్లకు చేరుకున్నది.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ప్రజా ప్రతినిధులు 'ఉక్కు' పోరాటంలోకి రావాలి

ప్రజాసక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రజా ప్రతినిధులు ప్రత్యక్షంగా విశాఖ ఉక్కు పోరాటంలోకి రావాలని, లేనిపక్షంలో ప్రజలుక్షమించరని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వివిఎస్ మూర్తి యాదవ్ అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 668వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో విశాఖ ఉక్కు శ్రామిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు ఆధ్వర్యంలో పలువురు కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి మూర్తి యాదవ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు లేకపోయినా ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తూ లాభాల బాటలో నడిచిందన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. అటువంటి కర్మాగారాన్ని అమ్మేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వందల రోజులుగా కార్మికులు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, కెఎస్ఎన్ రావు, వైటి దాస్, యు రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాస్, జెఆర్‌కె నాయుడు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్



కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోందని విమర్శించారు. బ్యాంకులు దివాలా తీసే విధంగా కార్పొరేట్లకు అప్పులు ఇస్తోందని, కార్మికులపై మాత్రం దాడి చేస్తోందని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. లేబర్ కోడ్‌లపై పార్లమెంటులో చర్చ చేపట్టకుండానే ఆమోదించారని తెలిపారు. ఆధునిక బానిసలుగా కార్మికులను మార్చేశారని పేర్కొన్నారు. తక్షణమే లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ల రద్దు కోరుతూ ఢిల్లీ నగరంలో లక్షల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన చేయబోతున్నట్లు ప్రకటించారు. బిజెపి అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలే రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు పని భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

14 నుంచి ఇంధన పరిరక్షణ వారోత్సవాలు

- జయప్రదం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల 14 నుంచి ఇంధన పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఇంధన శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. ఇంధన శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం మంత్రి సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏర్పాటు చేసిన ఇంధన పరిరక్షణ విభాగాలు (ఎనర్జీ కన్సర్వేషన్ సెల్స్) ఈ వారోత్సవాల్లో చురుకుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఇంధన సామర్థ్యాన్ని అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దీనివల్ల బహిరంగ మార్కెట్‌లో అదనపు విద్యుత్ కొనుగోళ్ల అవసరాన్ని తగ్గించవచ్చునని తెలిపారు. ఇంధన సామర్ధ్యం, ఇంధన పరిరక్షణ కార్యక్రమాలతో వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని, పర్యావరణం కూడా మెరుగవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తదితరులు పాల్గొన్నారు

తుపాను బాధితులను తక్షణమే ఆదుకోవాలి

- రైతులకు నష్టపరిహారం అందించాలి
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాండూస్ తుపాను బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని టిడిపి రాష్ట్రఅధ్యక్షులు కె అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. తుపాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో పంటలు పూర్తిగా పాడయ్యాయని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా చేపట్టాలని కోరారు. ఇప్పటికే కళ్లాల్లో ఉన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో అలసత్వం వహించడం తగదన్నారు. రైతులు పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వర్షం నీటిలో పంట కొట్టుకుపోయిన ప్రాంతాల్లో రైతులకు ప్రభుత్వం పంటనష్ట పరిహారం అందించాలని కోరారు.

అసమర్ధ ప్రభుత్వంతో రైతాంగానికి ఇబ్బందులు: అనగాని సత్యప్రసాద్

ముందచూపు లేని అసమర్ధ ప్రభుత్వంతో రైతాంగం ఇబ్బందులు పడుతుందని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతుల్ని వర్షాలు నిండా ముంచాయని ఒక ప్రకటనలో తెలిపారు. మరో వైపు ప్రభుత్వం నుంచి కనీస సహాయం అందుకపోవటం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. తుపాను ముప్పు ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిం చటం వల్లే అన్నదాతలు నష్టపోయారని విమర్శిం చారు. 175కు 175 సీట్లని అరవడం కాదని, కనీసం 175 మంది రైతులను ఆదుకోవాలని కోరారు.

తాడిపత్రి డిఎస్పిపై జాతీయ ఎస్సి కమిషన్‌కు వర్ల ఫిర్యాదు

తాడిపత్రి డిఎస్పిపై జాతీయ ఎస్సి కమిషన్‌కు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. దురుద్దేశపూర్వకంగా చట్టాలను తుంగలో తొక్కుతూ అమాయకులను కేసుల్లో ఇరికిస్తున్నారని విమర్శించారు. వీటికి సంబంధించి ఆయనపై అనేక ప్రైవేట్ కేసులు సైతం కోర్టుల్లో నమోదై ఉన్నాయని వివరించారు. చైతన్యను వేరే ప్రాంతానికి బదిలీ చేయాలని డిజిపిని కోరినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. వైసిపి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విద్యార్హతలపై మాట్లాడిందని దళిత మహిళపై ఎస్సి,ఎస్టి అట్రాసిటీ కేసు బనాయించారని పేర్కొన్నారు. దీనిపై కలుగచేసుకొని చైతన్యపై కేసు నమోదు చేసేలా డిజిపికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

బాధితులను ఆదుకోండి : సిపిఐ

తుఫాన్‌తో దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతాంగాన్ని, ప్రజలను ఆదుకునేందుకు తక్షణం సహాయక చర్యలను చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం నాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో పంటచేతికి వచ్చే దశలో తుఫాన్ రావడంతో పంటలన్నీ దెబ్బతిని తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. ఉద్యానవన పంటలకూ అపార నష్టం వాటిల్లిందని తెలిపారు. కింది స్థాయిలో అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తమపార్టీ పార్లమెంటరీ నేత బినోయ్ విశ్వం వరదబాదితుల సమస్యలపై కడపజిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులను అప్రమత్తం చేసి తక్షణం బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

అణగారిన వర్గాల ఐక్యత అవసరం

- అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చుదాం
- విగ్రహావిష్కరణ సభలో రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - దేవనకొండ (కర్నూలు)

ఎస్‌సి, ఎస్‌టి, బిసి అణగారిన వర్గాలు ఐక్యమత్యంతో కలిసి ఉండాలని, అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ సూచించారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కుంకనూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఇతర అన్ని వర్గాలకు సముచిత స్థానం ఉండేలా రిజర్వేషన్లు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. దేశంలో ప్రజలందరికీ కుల మతాలకు అతీతంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి హక్కులను రాజ్యాంగంలో కల్పించిన మహోన్నతుడని కొనియాడారు. బ్యాంకింగ్, బహుళార్థసాధక ప్రాజెక్టు, ఎలక్ట్రికల్ గ్రిడ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో అంబేద్కర్ కృషి అమోఘమని తెలిపారు. అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటును కొందరు వ్యక్తులు అడ్డుకోవడం, వ్యతిరేకించడం దారుణమని అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

- నిమ్మగడ్డ రామ్మోహనరావు విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ సభలో వి.శ్రీనివాసరావు పిలుపు



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ప్రజలను చైతన్య పరిచేందుకు విజ్ఞాన కేంద్రాల ఆవశ్యకత నేడు ఎంతో ఉందని, అందుకనుగుణంగా విజ్ఞాన కేంద్రాల రూపకల్పన జరగాలని అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహనరావు నగర్‌లో కామ్రేడ్ నిమ్మగడ్డ రామ్మోహనరావు విజ్ఞాన కేంద్రాన్ని శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించారు. నిమ్మగడ్డ రామ్మోహనరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఎం సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య అధ్యక్షత వహించారు. ఈ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరాడంబరతకు, నిజాయితీకి నిలువుటద్దంలా నిలిచిన నిమ్మగడ్డ రామ్మోహనరావు వంటివారు అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అయిన ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు హర్షణీయమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేస్తోందని, ప్రజల ఆస్తులను, ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. అధికారం కోసం ప్రజల మధ్య కుల, మత అడ్డుగోడలు నిర్మిస్తోందన్నారు. జిఎస్‌టి పేరుతో ప్రజల నడ్డి విరిచిందని, పెట్రో, గ్యాస్ ధరలను రెట్టింపు చేసిందని తెలిపారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చిన, రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రంలోని అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అంటకాగుతుండడం సిగ్గుచేటన్నారు. విద్యా రంగంలో బైజూస్ వంటి సంస్థలతో ఒప్పందాలు కార్పొరేట్ శక్తులను బలోపేతం చేయడానికేనని, ఆర్‌బికెలు రైతులకు భరోసా కల్పించడం లేదని విమర్శించారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీనియర్ నాయకులు జొన్న శివశంకర్ మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో పాల్గొన్న సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు

సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధిపై కేంద్రం నిర్లక్ష్యం

- మహాసభలో ఎస్ఎఫ్ఐ నాయకులు
- యూనివర్సిటీ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఎస్ఎఫ్ఐ అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ మొదటి మహాసభను ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. ఈ సభకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీల మేరకు అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు పూర్తయినా సెంట్రల్ యూనివర్సిటీకి సొంత భవనం కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. దేశం నలుమూలల నుంచి విద్యను అభ్యసించేందుకు వచ్చిన విద్యార్థులు ఇక్కడ సమస్యల లేమితో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిన స్థలంలో కనీసం ప్రహరీ కూడా నిర్మించలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఒక్కో సంవత్సరం ఒక్కో భవనంలో పాఠాలను బోధించే పరిస్థితి నెలకొందన్నారు. కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధి కోసం భవిష్యత్తులో విద్యార్థులను కలుపుకుని ఎస్ఎఫ్ఐ ఆందోళనలు చేస్తుందన్నారు.

ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ నూతన కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ అధ్యక్షులుగా భావన, కార్యదర్శిగా ఎ.ఎం.అనిల్, సహాయ కార్యదర్శిగా నవీన్ కుమార్, ఉపాధ్యక్షులుగా అఖిలా, సభ్యులుగా కమల్‌నాథ్, అతుల్ వర్మ, షకీల్, షకీల్, శరత్, సోనాల్, జాన్ ఎన్నికయ్యారు.

నేటి నుంచి విఆర్‌ఓల ఆందోళనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ అధికారుల(విఆర్‌ఓలు)ను ప్రభుత్వం ఎనలేని ఒత్తిడికి గురిచేస్తోంది. విధుల నిర్వహణకు అవసరమయ్యే స్టేషనరీకి కూడా నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ససేమిరా అంటోంది. రీసర్వే గడువుతో లక్ష్యాలను నిర్దేశిస్తూ ఒకవైపు పని ఒత్తిడి పెంచుతున్న ప్రభుత్వం విఆర్‌ఓలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. దీంతో వారు ఆందోళన బాట పట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి మధ్యాహ్న భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద అరగంట సేపు ఆందోళనలు చేసేందుకు విఆర్‌ఓలు సిద్ధమయ్యారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించాలని విఆర్‌ఓల రాష్ట్ర కమిటీ ఇటీవల ఓ నిర్ణయం తీసుకుంది. భూముల రీ- సర్వే పేరుతో అధికారుల నుంచి ఒత్తిళ్లను తట్టుకోలేక అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారని విఆర్‌ఓలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 30 ఎకరాల వంతున రీ-సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాలు నిర్ణయించిందని, 100 రోజుల్లో పూర్తి సర్వే చేయాలని నిర్దేశించడం సరి కాదని వారు వాపోతున్నారు. భూముల రీ సర్వే లక్ష్యాలు నిర్ణయించడంతో పెద్ద ఎత్తున రికార్డుల నమోదు తప్పులు దొర్లే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్యాలు, ఒత్తిళ్ల వల్ల విఆర్‌ఓలు, తహసీల్దార్లు, ఉద్యోగులు పలువురు అనారోగ్యానికి గురవుతున్నారని, ఉద్యోగులు గుండెపోటుకు గురౌతున్నారని తెలిపారు. రీ సర్వే గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండకపోవడం, భూ యజమానులు ఎక్కడెక్కడో నివాసాలు ఉంటుండటంతో డాక్యుమెంట్లు తెప్పించుకోవడానికి సమయం పడుతోందని, ఈ నేపథ్యంలో సమయంలో రీ సర్వేపై గడువు విధించడంతో రికార్డుల్లో తప్పులు దొర్లే అవకాశమందని పేర్కొంటున్నారు. ఇది ఇలా ఉంటే ధాన్యం సేకరణకు సంబంధించి మిల్లర్ల వద్ద కస్టోడియన్ ఆఫీసర్లుగా విఆర్‌ఓలు వ్యవహరించాల్సి రావడం కత్తిమీద సాములాగా మారిందని విఆర్‌ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కెమికల్ ఫ్యాక్టరీలో మంటలు..

ప్రజాశక్తి-గ్రోత్ సెంటర్ (ప్రకాశం జిల్లా)

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కెమికల్ ఫ్యాక్టరీలో మంటలు చెలరేగి సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలంలోని గ్రోత్ సెంటర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం... కొంకణం నుండి ప్రసాద్ ఆర్గానిక్ అనే కెమికల్ ఫ్యాక్టరీలో పెర్‌ఫ్యూమ్స్ తయారుచేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలో కార్మికులు విధులు నిర్వర్తిస్తుండగానే.. ఫ్యాక్టరీలో విద్యుదాఘాతం కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కార్మికులు బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఒంగోలు, అద్దంకికి చెందిన రెండు ఫైర్ ఇంజన్లతో ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా ప్రయత్నించి మధ్యాహ్నం 12.30కు మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీలోని ఖరీదైన మిషనరీ, పెర్‌ఫ్యూమ్‌కి ఉపయోగించే ద్రావణం పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టమూ జరగక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌సి,ఎస్‌టి సబ్‌ప్లాన్ కాలపరిమితిని పొడిగించండి

(మొదటి పేజీ తరువాయి)

అందించిన తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు తమవాటా నిధులను పూర్తిస్థాయిలో అందించకపోవడంతో 2013నుండి చాలా పథకాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రక్షణ అవసరమని తెలిపారు. ఈ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్ 2013 చట్టంలోని చాప్టర్1వక్లాజులోని 4వ అంశాన్ని సవరించి కాలపరిమితిని పెంచేలా రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని లేఖలో కోరారు.



10కె వాక్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఒపిఎస్‌ను పునరుద్ధరణ కోసం

ఉపాధ్యాయుల 10కె వాక్

ప్రజాశక్తి - పెనుమంట్ర (పశ్చిమగోదావరి)

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట మండలాల ఉపాధ్యాయులు ఆదివారం 10కె వాక్ నిర్వహించారు. పెనుమంట్ర మండలంలోని మర్టేరు నుండి ప్రారంభమైన వాక్ ఆలమూరు వరకు సాగింది. సిపిఎస్ రద్దు చేస్తామనిపాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి అమలు చేయాలని, సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని, ఒపిఎస్ మాత్రమేనని నినాదాలు చేశారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లయినా ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. సిపిఎస్ రద్దు కోసం జరిగే పోరాటాలను ప్రభుత్వం అణచివేయాలని చూడడం అవివేకమన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎవికె.రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రామానుజరావు, జిల్లా కోశాధికారి పట్టాభి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

- టిఎన్‌టియుసి రాష్ట్ర సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలంటూ టిఎన్‌టియుసి రాష్ట్ర సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసింది. విశాఖ నగరంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం తెలుగు ప్రజల ఆత్మగౌరవమని, అటువంటి దాన్ని ప్రయివేటుపరం చేయడం దారుణమని అన్నారు. గత నెలలో విశాఖకు వచ్చిన మోడీని కార్మిక నేతలు కలిసేలా సిఎం జగన్మోహన్ రెడ్డి ఏర్పాట్లు చేయలేకపోవడం సరికాదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి హయాంలో భవన నిర్మాణ రంగం కుదేలైందని, ఇసుక కొనలేని పరిస్థితి నెలకొందని అన్నారు. దీంతో 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, టిఎన్‌టియుసి నాయకులు బండారు అప్పారావు, కె లెనిన్ బాబు, విల్లా రామ్మోహన్ కుమార్, నక్క లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎసిబి వలలో సిఐ

- రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సిఐ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) వలలో చిక్కారు. ఓ కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు డబ్బులు తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు సిఐ రాముతోపాటు కానిస్టేబుల్ కరీమ్‌ను శనివారం రాత్రి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి శివనారాయణ తెలిపిన సమాచారం మేరకు.. నెల్లూరుకు చెందిన మల్లికార్జున అనే వ్యక్తి బుక్కరాయసముద్రం మండల పరిధిలో కొండారెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన భూమిని లీజుకు తీసుకొని డిఎడ్ కళాశాల నడుపుతున్నారు. ఈ క్రమంలో కళాశాల యజమాని మల్లికార్జున, ఆయన భార్య, తమ్ముడు తనను మోసం చేశారని భూ యజమాని కొండారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుక్కరాయసముద్రం పోలీసులు మల్లికార్జునను అరెస్టు చేశారు. ఆయన భార్య, తమ్ముడు పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వారు హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. బెయిల్ ఇవ్వాలంటే రూ.75 వేలు లంచం ఇవ్వాలని సిఐ రాము డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా సిఐకి మొదట రూ.50 వేలు చెల్లించారు. మిగతా రూ.25 వేలు కోసం వేధిస్తుండడంతో ఆయన ఎసిబిని ఆశ్రయించారు. ఫిర్యాదుపై స్పందించిన ఎసిబి అధికారులు సిఐ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఆయనకి సహకరించిన కానిస్టేబుల్‌ను కూడా అరెస్టు చేశారు.



"నాది ప్రజల ఉద్యమం. ఎవరినో సంతోషపెట్టటానికి దానిని వదులుకోను. నా ఆశయం ప్రజల ఆశయం. సంస్కారవంతుల సదభిప్రాయం నాకు అండగా ఉంది."

- గురజాడ

ఇప్పుడేమంటావు?

కర్మంటావు ఖర్మంటావు
లేశమైనా ప్రయత్నం చేయనంటావు
మోసాలను చూస్తూనే ఉంటావు
సహిస్తూనే సంచరిస్తూనే ఉంటావు
ఎదురు తిరగాలన్న ధ్యాసని మాత్రం
దరిచేరనీయనంటావు దాక్కుంటావు
సంఘానికి తిరగబడే సింహాలను
భయంగానే ఓ కంట కనిపెడుతూ
నిష్క్రియాలోలత్వంతో జతపడి
సంసారం చేస్తుంటావు
సంధి చేసుకుంటావు
ప్రకృతికి ఎదురేగిన మానవుల
విజయాల విస్తృతి తెలీదంటావు
నాణానికి రెండు వైపులున్నా
ఒకవైపే ఉందని నటిస్తుంటావు
నమ్మించ ప్రయత్నిస్తూ వుంటావు
నటనలో జీవిస్తుంటావు
అందరి శ్రమను ఒకటిగ చేసి
పెట్టుబడి పోగుపడితే పొగరుపడితే
డబ్బున్నోడి అందలాల ఆనందాలను
నీ సొంతమనుకొని ఊగిపోతావు
గడ్డిపోచ బరువుతో తేలిపోతావు
ఊహల్లో కూడ అన్యాయాన్నెదిరించక
ఉగ్గుపాలతో అలవాటైన దాస్యానికి
దార్శనికులమని చెప్పే నాయకుల
నయవంచన పంచన చేరతావు
జరుగుతున్న మోసాన్ని చూడమంటే
ఇప్పుడేమంటావు అదే అంటావు
నీ కర్మ అంటావు నీ ఖర్మ అంటావు!

- జంధ్యాల రఘుబాబు
9849753298

అంటుకడదాం..

భూమి పొరల్లో పూడుకుపోయిన
ఆస్తి పంజరాల కథలు వినాలంటావా
చెవులు కాదు చదివే మనసు కావాలి!
ఆకాశం శూన్య శరీరం మీద
మచ్చల చరిత్ర మహాగ్రంథం రాయాలంటావా
చేతులు కాదు రాసే అక్షరాలు కావాలి!

చీకటి సముద్రాన్నెంత తోడి పోసినా
చీకటి మిగులుతుంది చివరికి
అజ్ఞానం గుట్టలుగా పోసినట్టు
గతం వర్తమానం భవిష్యత్తూ
త్రిముఖ కోణాలై చీకటి కళ్ళు తెరుస్తాయి
నీకు నీవే కాదు
ఎదుటి వాడు కూడా చీకటి గుడారమే
జటా ఝులిత నత్యాంగనైన చీకటి రాక్షసిని
ఒక్క కిరణంతో చంపగలగాలి
దీపం వెలిగించు జ్ఞానంతో
చీకటి పాలపుంతై పోతుంది
అనుభవాల యిరుసుమోసే చక్రాలు రెండూ
భూత భవిష్యత్తులై పోతాయి

మనసు ప్రపంచ చరిత్రను చదువుతూ
పంచభూతాల్లో అస్తిత్వాన్ని రచిస్తోంది
బతుకు పడవకి చుక్కాని చదువు
రేపటి కోసం నీ జ్ఞాపకాల సూర్యుణ్ణి
భూమ్మీదకు విసిరెయ్
కొత్త ఆశలకి అంటుకడతారు జనం!

- ఈతకోట సుబ్బారావు
94405 29785

స్వాగతం సుస్వాగతం...

ఆశా వర్కర్ల రాష్ట్ర మహాసభలకు
స్వాగతం.... సుస్వాగతం ..2

చరణం1 : ఎఱ్ఱ జెండ చేత పట్టి పోరాట బాట పట్టి
కనీస వేతనము కొరకు రోడ్డెక్కి కదం తొక్కి.. 2
పాలకులు నిర్బంధం ఎదిరించిన వనితలకు
స్వాగతం... సుస్వాగతం...2

చరణం 2 : వేకువ జామున లేచి తీతువు పిట్టై తిరిగి
గర్భిణీలకు సేవ చేసి పురుడు పోసీ.. మందులిస్తే
గౌరవం, గుర్తింపు లేకున్నా సేవచేసే ఆశా వర్కర్లకు
స్వాగతం... సుస్వాగతం ..2
చరణం3 : పనిభారం మోయలేక కనీస వేతనం లేక
అధికారులు వేధింపులు అనునిత్యం భరిస్తూ....2
సమాన పనికి సమాన వేతనంకై దీరుల్లా పోరాడిన అశాలకు
స్వాగతం... సుస్వాగతం...2

- రెడ్డి శంకరరావు
94943 33511

రజనీశ్రీ సాహిత్య పురస్కారానికి ఆహ్వానం

ప్రముఖ నాటక కళాకారులు, నాట్యాచార్యులు రజనీశ్రీ రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం ఈ సంవత్సరం కథలకు అందించనున్నాం. ఈ పురస్కారం కింద ప్రశంసాపత్రం, శాలువాతో పాటు రూ.10,116లు నగదు అందిస్తాం. రచయితలు తమ సొంత కథా సంపుటాలను పంపాలి. అవి జనవరి 2018 నుండి 2022 డిసెంబర్ 31 మధ్య ముద్రించబడి ఉండాలి. నాలుగు ప్రతులు డిసెంబర్ 31వ తేదీ 2022 లోగా చేరునట్లు పంపాలి. చిరునామా : గాజుల రవీందర్, ఇంటి నంబర్ 8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ -505001. వివరాలకు 9848255525లో సంప్రదించవచ్చు.

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ-2.

prajasavvadi@gmail.com

తాతగారి పెన్నూ దాన్నపహరించిన మనవరాలు



నేను కుందుర్తి గారిని, అంటే మా తాతగారిని ఎప్పుడూ చూడలేదు. కానీ ఆయన్ను నేను ఒక వ్యక్తిగా కంటే ఒక వ్యక్తిత్వంగా, ఒక ఆశయంగా బాగా గుర్తుంచుకుంటాను. ఆయనకి నేను మనవరాలికంటే ముందు అతి పెద్ద కవిత్వాభిమానిని. సాహిత్యాభిమానిని. మా నాన్నగారు సత్యమూర్తి గారు, వాళ్ళ నాన్న గారు నమ్మిన ఆదర్శాలని అనుసరిస్తూ, ఆశయాలను ఆచరిస్తూ, తాతగారు మొదలెట్టిన ఫ్రీవర్స్ ఫ్రంట్ ఉద్యమాన్ని ఒక దీక్షగా ముందుకు నడిపించటం నేను చిన్నప్పటినుండీ చూస్తూ వచ్చాను. ప్రతి రోజూ పొద్దున్నే నాన్న కాఫీ తాగుతూ, మా తాత గారివీ, ఇతర కవులవీ పుస్తకాలను చదువుతూ ఉంటే, నేను ఆయన పక్కన కూర్చుని అర్థమైనా కాకపోయినా వాటిని చదివేస్తూన్నట్టు తిరగేసేదాన్ని. తాతగారి పుస్తకాల్లో కవితల ఇతివృత్తమూ, సందర్భమూ ఏవీ అర్థం కాకపోయినా, చాలా సులువైన పదాలూ, సరళమైన భాష ఉండేవి. తాతగారి పుట్టినరోజు వచ్చినా, తద్దినం వచ్చినా మా ఐదుగురు అత్తయ్యలనీ, వాళ్ళ కుటుంబాలనూ పిలిచి ఒక సంబరంలా జరిపించేవారు మా నాన్న. తాతగారు తన కవితల్ని చదివిన క్యాసెట్టు ఖచ్చితంగా ప్లే చేసేవారు. అలాగే ఆయన కంఠం నాకు పరిచయం.

తెల్లటి పంచా, లాల్చీ వేసుకునే నల్లటి మనిషినీ, కాలనీలో కూరల షాపు, కిరాణా కొట్టు, బట్టల దుకాణం అన్నిటిలో అప్పు ఖాతాలుండేవనీ, అయినా ఆయన మీదున్న అపారమైన గౌరవంతో తిరిగిచ్చేవరకూ ఎవరూ డబ్బులడిగేవారు కాదనీ మా నాన్న చెప్తూండేవారు. ఇవన్నీ విన్నాక, ఇంట్లో గోడమీద వేలాడే ఫొటో చూస్తూ చూస్తూ తెల్లటి వస్త్రాల్లో ఒక నల్లటి, ఎత్తైన, నిరాడంబరత, ఠీవీ రెండూ కలబోసిన ఒక రూపంలో కుందుర్తి గారిని ఊహించుకునేదాన్ని. తాతగారి కంఠం క్యాసెట్టులో వింటూ, ఆయన పప్పుచెక్క తింటూ కిటికీ పక్కన కూర్చుని చదివి ఉంటారు అని ఊహించుకునే దాన్ని. అక్కడ కూర్చుని ఆరు బయట ఉండే పెద్ద గుల్మొహర్ చెట్టుపై ఎర్రపూలని చూస్తూ, నేనూ తాతగారిలా కవితలు రాసేయాలి అనుకునేదాన్ని! మేము టెన్త్ క్లాసులో ఉన్నప్పుడు, అంటే 1996-97లో, తెలుగు టెక్స్ట్ బుక్‌లో తాతగారి కవిత ఒకటి సిలబస్‌లో ఉండేది. కవి పరిచయంలో తాతగారి గురించి ముందే తెలిసిన విషయాలు ఉండడం, ఫ్రెండ్స్ అందరూ మీ తాతగారా, మీ 'సొంత' తాతగారా అని ఆశ్చర్యపోవడం, నేను గర్వంతో పొంగిపోవడం నాకు ఇప్పటికీ బాగా గుర్తు.

మా ఇల్లు ఒక చిన్నసైజు గ్రంథాలయంలా ఉండేది. కవిత్రయ మహాభారతం నుంచి శ్రీశ్రీ మహాప్రస్థానం వరకూ తాతగారు, ఆ తరువాత నాన్నగారు సేకరించిన బోలెడు పుస్తకాలతో గదుల్లోని అరలన్నీ నిండిపోయి ఉండేవి. ఏటా వేసవి సెలవుల్లో మాకు తప్పక ఉండే ప్రాజెక్టు ఏంటంటే- వరుస తప్పిపోయిన పుస్తకాలన్నిటినీ వాటి సరైన స్థానంలో పెట్టడం. వేటివైనా అట్టలు చిరిగిపోతే మళ్ళీ వేసి పెట్టడం. కొత్తగా వచ్చిన పుస్తకాలకి సీరియల్ నంబర్లు రాయడం. దుమ్ము దులిపి శుభ్రం చేసుకోవడం. అమ్మ పాత చీర చింపి అరలకి పరదాల్లా ఎక్కించడం. మా తాతగారు కూడా అలాగే సర్దుకునేవారట!

ప్రతి సంవత్సరం దసరా (1982, అక్టోబరు 25న మా తాత గారు చనిపోయిన రోజున దసరానేనట) తరువాత నుంచి మా ఇంట్లో ఫ్రీవర్స్ ఫ్రంట్ హడావుడి మొదలయిపోయేది. నాన్న కొత్త కొత్త కవితల పుస్తకాలు ఇంటికి పట్టుకొచ్చేవారు. పడుకునే వరకూ వాటిని చదువుతూ ఉండేవారు. నేనూ నాన్న పక్కలో దూరి అందరి కవితలూ చదివేస్తూ ఉండేదాన్ని. ఫ్రీవర్స్ ఫ్రంట్ మీటింగు ప్రతి ఏడాదీ డిసెంబరులో శీలా వీర్రాజు గారి ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఆ పనుల మీద వాళ్ళింటికి నాన్న, నేనూ తరచూ వెళుతూ ఉండేవాళ్ళం. శీలావీ గారి ఇల్లు ఒక కళా మందిరం. వాళ్ళింట్లో ఉండే బొమ్మల్నీ, పెయింటింగ్స్‌నీ, మొక్కల్నీ, శీలావీ గారి టేబుల్ మీదుండే రకరకాల పెన్నులు, బ్రషులూ, రంగులూ ఇవన్నీ చూడాలని నాకు చాలా ఆసక్తిగా ఉండేది. వీర్రాజు గారిలోని గాంభీర్యం కొంత భయపెట్టినా, సుభద్రాదేవి గారి ఆత్మీయత నాకెప్పుడూ ఆ ఇల్లు నాదే, వీళ్ళంతా నా వాళ్ళే అన్న భావనే కలిగించేది. ఈరోజుకీ ఆవిడ 'నువ్వు మా ఇంటి పిల్లవే, కవితా' అంటారు ఆప్యాయంగా. నాన్న, వీర్రాజు గారూ, సుభద్రాదేవి గారూ గంటల తరబడి చర్చించుకునేవారు. ఎవరెవరికో ఫోన్లు చేసేవారు. పెద్దయ్యాక ఈ పనులన్నీ 'నేనే చేసేస్తాను' అనేదాన్ని అమాయకంగా. అందరూ అందంగా నవ్వేవారు. ఆ నవ్వుల్లో తాతగారున్నారు.

అవార్డుగా ఇచ్చే ప్రతిమని ఆర్డరు ఇవ్వడానికి షాపుకు వెళ్ళడం నుంచి శీలావీ గారి చేతిరాతతో ఉన్న ఆహ్వాన పత్రికని చిక్కడపల్లి ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించి తెచ్చేవరకూ అన్ని పనుల్లో ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. చిన్నప్పుడు హైదరాబాదులోనే ఉండే సీనియర్ కవులకీ, ముఖ్య అతిథులకీ వారింటికి వెళ్ళి పత్రికలు అందించేవాళ్ళం. తరువాతి కాలంలో, ఫోన్ల వాడకం ఎక్కువయాక, పత్రికలు పోస్టులో పంపి, ఫోను చేసి చెప్పేవారు. కవులందరి అడ్రెసులు కవర్ల పైన రాసి, స్టాంపులతికించి, పోస్టు చేయడం మా పని. ఇక మీటింగు రోజు హడావుడి అంతా ఇంతా కాదు. తాతగారి పుస్తకాలు, తీసుకెళ్ళవలసిన సామాన్లన్నీ సర్దుకుని ఒక గంట ముందుగానే సిటీ సెంట్రల్ లైబ్రరీకి చేరి, 'ఫ్రీవర్స్ ఫ్రంట్' అని పెద్ద పెద్ద అక్షరాలతో ఉన్న నీలి రంగు బ్యానర్‌ని స్టేజీ వెనుక కట్టేవాళ్ళం. స్టేజీపై కుర్చీలన్నీ సర్ది, ప్రతి కుర్చీ ముందూ మంచినీళ్ళ గ్లాసులు, ఆపిలు పళ్ళూ పెట్టేవాళ్ళం. వచ్చినవారు కూర్చోవలసిన కుర్చీలు కూడా వరుసగా పెట్టి, కవుల కోసం ఎదురుచూసేవాళ్ళం. ఈ ఎదురుచూపులో తాతగారి కోసం తపన పడ్డ ఒక అమాయక మనవరాలుంది. మొదట ఎప్పుడూ శీలావీ దంపతులే వచ్చేవారు.

ప్రముఖ కవులు ఎవరైనా హాల్లోకి అడుగు పెట్టగానే, మా నాన్న ఆయనెవరో తెలుసా అన్నట్టు నా వైపు చూడటం, నాకు తెలిస్తే ఠక్కుమని సంతోషంగా పేరు చెప్పేయడం, లేదా తెలీదని బుంగమూతి పెడితే ఆయన చెప్పడం, అలా నేను వారిని గుర్తుపెట్టుకోవడం- ఇదంతా మాకు మామూలు. నాన్న వెనుకే తోకలా తిరిగేదాన్ని కనుక నాన్న పలకరించడానికో, ఆహ్వానించడానికో వెళ్ళిన ప్రతివారూ, మీ అమ్మాయా? పేరేంటి అని అడగటం, నేను 'కవిత' అని చెప్పడం, వారు 'ఓ కవితా, మరి నువ్వు కూడా కవితలు రాస్తావా' అని అడగడం, నేను ముసిముసిగా మురిసిపోవడం ప్రతి ఏడాదీ జరిగేది. అప్పుడే ఎప్పుడో కవిత్వ బీజం నాలో నాటుకుని ఉంటుంది. అంతే కాదు, తాతగారి కవిత్వ పుస్తకాలన్నిటి అట్టలపైనా, 'కుందుర్తి కవిత' అని ఉండేది. 'అది నా పేరే కదా' అని చాలా గర్వపడిపోయే దాన్ని. ఆ అతిశయంలో తాతగారిపై నా పెదవులకి తీరని ముద్దుంది. అందుకే ఇప్పటికీ పెళ్ళయ్యాక కూడా ఆ పేరే మార్చుకోకుండా అలాగే ఉంచుకున్నాను.

సభ మొదలయ్యాక కవుల ప్రసంగాలూ, మాటలూ, చిన్నప్పుడు అర్థం కాకపోయినా వినేసేదాన్ని కానీ, పెద్దయ్యాక కొద్ది కొద్దిగా అవగాహనలోకొచ్చాక చాలా స్ఫూర్తినిచ్చేవి. ఎండ్లూరి సుధాకర్‌గారి వర్తమానం మొదలు, హైమావతి నిషిద్ధాక్షరి, యాకూబ్ గారి ఎడతెగని ప్రయాణం, ప్రసాదమూర్తి గరి పూలండోయ్ పూలు ... ఇలా ఎన్నో పుస్తకాలు నన్ను ఎంత పరిణితికి గురిచేశాయో మాటల్లో చెప్పలేను. ఈ కవులందరి మాటలూ, కవితలూ సరళంగా ఉంటూనే ఇంత బలంగా, ఆలోచన రేకెత్తించేవిగా, సమాజాన్ని ప్రశ్నింపజేసేవిగా ఉన్నాయి కదా. మరి వీరందరికీ మార్గదర్శి అయి, సామాన్యుడికి అర్థమయ్యేదే, అన్యాయాన్ని ప్రశ్నించేదే కవిత్వమని నమ్మి తన జీవితాన్ని ఆ ఆశయానికి ధారపోసిన కుందుర్తి, మా తాత గారు, ఎంత గొప్పవారో కదా అని. ఆయన కవిత్వం ఇంకెంత గొప్పగా ఉంటుందో కదా అనే తీవ్రమైన ఆలోచన నాలో అప్పుడు మెదిలింది. అప్పుడు ఒక కొత్త దృష్టితో తాతగారి పుస్తకాల అధ్యయనం మొదలెట్టాను. పెద్ద పెద్ద వాళ్ళందరూ ఆయన గురించి అంత గొప్పగా ఎందుకు చెప్తారో అప్పుడు అర్థమయింది. బతికున్నంత కాలం చివరి దాకా, తన తండ్రి ఆశయాలనీ, ఉద్యమాన్నీ ఎన్ని ఆటంకాలు ఎదురైనా నిరాటంకంగా, నిర్విరామంగా కొనసాగించి, తన తండ్రికే కాదు, ఏ తండ్రికైనా ఇలాంటి కొడుకుండాలనే పేరుని సంపాదించు కున్నారు మా నాన్న, కుందుర్తి సత్యమూర్తి. నాకూ మా నాన్నకి తగ్గ కూతురని అనిపించుకోవాలని దురాశ ఉండటం తప్పు కాదేమో!

మా తాతగారి ముఖచిత్రం ఆయిల్ పెయింటింగ్‌తో ఉండాలని మా నాన్న గారి కోరిక. శీలా వీర్రాజు గారి సూచన మేరకు ఎస్.ఎం కేతా గారి దగ్గర వేయించాము. ఆ ఫోటో చుట్టూతా అద్దం తలుపులతో చిన్న, చిన్న అరలు పెట్టించారు నాన్న. పై అరల్లో, తాతగారి పుస్తకాలన్నీ వరుసగా సర్ది పెట్టాం. ఒక అరలో, ఎన్నో ఏళ్ళ నుంచి జాగ్రత్తగా దాచిన తాతగారి కళ్ళద్దాలు, ఆయన వాడిన పెన్నూ ఉండేవి. నాకా పెన్నుతో రాసేయాలని చాలా కోరికగా ఉండేది. నాన్నేమో 'పెద్దయి తాతలా మంచి కవితలు రాస్తే నీకా పెన్ను' ఇస్తాననేవారు. మరొక అరలో కేంద్ర సాహిత్య అకాడమీ ట్రోఫీ ఉండేది. పైన మరో దాంట్లో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు గ్రహీతలకు ఇచ్చే కలం పట్టుకున్న మనిషి ప్రతిమ ఉండేది. మా ఇంటికి అతి పెద్ద ఆకర్షణ ఆ గోడే. ఆ గోడపై అతికిన రంగులోనే తాతగారిపై నాకున్న ప్రేమ కలగలసి ఉంది.


నేను పెళ్ళయి సింగపూరు వచ్చేసేప్పుడు, నాకు ఇంట్లో నచ్చిన వస్తువులన్నీ - అంటే నా చిన్నప్పటి ఫోటోలు, డ్రాయింగులు, గ్రీటింగ్ కార్డులూ, డైరీలు, తాతగారి పుస్తకాలూ- అన్నీ ప్యాక్ చేసి తెచ్చుకున్నాను. వాటితో పాటూ నాన్నకి తెలీకుండా తాతగారి పెన్నుని కూడా (దొంగతనంగా) తెచ్చేసుకున్నాను. అప్పుడప్పుడూ తాతగారి పుస్తకాలు తిరగేస్తూనే ఉండేదాన్ని. చదివిన ప్రతిసారీ కొత్తగా అర్థమయ్యేవి, ఏదో ఒక కొత్త కోణం కనిపిస్తూనే ఉండేది. ఆయన గురించి చదివి తెలుసుకుంటున్న కొద్దీ ఇంకా ఇంకా గర్వంతో మనసు ఉప్పొంగిపోయేది. కళ్ళు అప్రయత్నంగా చెమర్చేవి. ఒక దొంగలాగా పెన్ను తెచ్చేసుకున్నానన్న మాటే గానీ, ఆ పెన్నుతో రాసే అర్హత నాకు లేదని తెలిసేందుకు ఎక్కువ కాలం పట్టలేదు. అందుకే దాన్ని అందమైన చెక్కపెట్టెలో పెట్టి అలాగే భద్రపరిచాను.

1982 అక్టోబర్‌లో తాతగారు మరణించిన తర్వాత నాన్నగారు శీలా వీర్రాజు గారి సహకారంతో 1982 నుంచి 2011 వరకూ ఫ్రీవర్స్ ఫ్రంట్ కవిత్వ పురస్కారాలని తమ సొంత ఖర్చులతో అందజేసారు. 2011లో మా నాన్నగారి హఠాన్మరణానంతరం మా అమ్మ కుందుర్తి శాంత ... వారి ఆశయాన్ని కొనసాగించింది. శీలా వీర్రాజు, సుభద్రాదేవి గార్ల సహాయ సహకారాలతో 50 పురస్కారాలు పూర్తి చేయాలని సంకల్పించి, 2012 నుంచి 2019 వరకూ ఫ్రీవర్స్ ఫ్రంట్ కవిత్వ పురస్కారాలు అందజేసింది. వచన కవిత్వ ప్రస్తావనలో మా అమ్మ కూడా ఒక అక్షరంలా ఎప్పటికీ నిలిచిపోతుందేమో! ఇన్నేళ్ళుగా ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి సహకరించిన కవులందరివీ, అవార్డు గ్రహీతలైన కవులందరివీ ఫోను నంబర్లు సుభద్రాదేవి గారు ఎంతో కష్టపడి సేకరించి మాకు పంపితే, నేనూ, మావారూ వారందరినీ ఒక వాట్సాప్ గ్రూపులో చేర్చి ఈ ఫ్రీవర్స్ ఫ్రంట్ కుటుంబాన్ని కలపగలిగాము. అవార్డు గ్రహీతలందరినీ ఓసారి స్మరించుకున్నాము. ఈ సందర్భంగా 'ఫ్రీవర్స్ ఫ్రంట్' పేరుతో ఫేస్ బుక్ పేజీని ప్రారంభించాను నేను. ఫ్రీవర్స్ ఫ్రంట్ చరిత్ర, ఇప్పటిదాకా ఈ అవార్డు అందుకున్నవారి వివరాలూ, కవితలూ, వారి స్పందనలూ, ఈ సంస్థ పట్ల అభిమానం కలవారు చేసిన వ్యాఖ్యానాలూ, కుందుర్తి గారిపై వెలువడిన వ్యాసాలు, వారి కవితలు ఇందులో పొందుపరచడానికి ప్రయత్నిస్తున్నాను. ఫ్రీవర్స్ ఫ్రంట్ తెలుగు వచన కవిత్వ చరిత్రలో ఒక మహత్తర ముద్ర.

50వ అవార్డు తర్వాత ఇక ఈ అవార్డును ఆపి వేయాలని నిర్ణయించుకున్నాము. బాధాకర విషయమే. ఏ సంస్థకైనా 50 ఏళ్ళ మైలురాయిని చేరగలగటం చిన్న విషయం కాదు. అదీకాక కుందుర్తి గారి శతజయంతి సంవత్సరంతో ఈ ముగింపుని చేయడం కొంత ఉద్విగ్నతకి గురిచేస్తోంది. తప్పొప్పుల చర్చల మధ్య ప్రతిమలా నిల్చున్నాను. ఇప్పుడు కుందుర్తి శతజయంతి వేడుకల సందర్భంగా నా జ్ఞాపకాలనిలా పంచుకోడానికి, ఆ గొప్ప మనిషి పట్ల నా గౌరవాభిమానాల్ని ఇలా నాల్గు అక్షరాల్లో చెప్పేందుకూ, చెక్కపెట్టెలోంచి తాతగారి పెన్నునే బయటకు తీసాను. ఇలా వందేళ్ళ శతజయంతి వేళప్పుడు తాతగారి కవితలన్నీ ఇలా మిత్రులతో కలిసి మీముందుకు తేవడం నన్ను ఉద్వేగానికి గురిచేస్తోంది.

- కుందుర్తి కవిత

కవి కుమారుడి నవీన కవిత్వం



చిరంజీవి శ్రీ వశిష్ఠ వశిష్ఠుడుగా నాకు పరిచయం కాలేదు. సత్కవి, సజ్జనుడూ అయిన సోమేపల్లి వెంకటసుబ్బయ్య కుమారుడుగా పరిచయమయ్యాడు. తండ్రికి తగ్గ కొడుకుగా కవి అయ్యాడు. తన తొలి కవితా సంపుటిలోనే వైవిధ్యభరితమైన కవితలతో మన ముందుకు వస్తున్నాడు వశిష్ఠ. వలస కూలీల వేదనను, గిరిజనుల బాధల్ని, పెట్టుబడి సామ్రాజ్యం పీడనల్ని, మనువు రాతల పట్ల నిరసనల్ని, రాజకీయాల పట్ల చురకల్ని, మత విద్వేషాల పట్ల ఆవేదనను తన కవిత్వానికి వస్తువులుగా మలచుకొన్న ఈ కవి ప్రధానంగా కులమత భేదాలు లేని సమాజాన్ని, మానవత్వం నిండిన మనిషిని కలగంటున్నాడు. అదే సమయంలో యాంత్రికంగా సాగిపోతున్న పరుగుపందాల మధ్య కోల్పోతున్న సజీవ క్షణాల గురించిన ఆవేదన కనిపిస్తుంది. కన్నబిడ్డల చదువుల్ని, ఆశల్ని, కలల్ని రిమోట్ కంట్రోల్‌తో నియంత్రించే తల్లిదండ్రులు, వారి వల్ల వేదన పాలవుతున్న బిడ్డలు, బిడ్డల చదువుల కోసం అడ్డాలో చెమటగా కరిగిపోయే తండ్రులు, అరచేతిలో ప్రపంచాన్ని ఆవిష్కరించుకొని, ఆ ప్రపంచంలో కన్నతల్లికి చోటివ్వలేకపోతున్న బిడ్డలు - అందరినీ మనముందు నిలబెట్టాడు కవి. మతం పూసుకున్న మనుషుల్ని తయారు చెయ్యటం, విద్వేష విషాన్ని నూరిపొయ్యటం ఆధునిక రాజకీయ విద్య. శాంతియుత సహజీవనం అనేది భారతీయాత్మ. అయితే దాన్ని ధ్వంసించే శక్తులు, యుక్తులు విజృంభించటం నేటి విషాదం. 'అన్ని రక్తాలూ ఒకటి కాదనటం', వర్గాలను విడదీసి విరగ్గొట్టటం', 'చూపుడు వేలు గల విగ్రహాలను విరగ్గొట్టటం' ఈ నేపథ్యంలో 'గుండెలు తెగిన జెండాను చూస్తున్నాడు కవి. జెండా కన్నీటిని 'తుడుస్తావా?' అని ఈ దేశ పౌరుణ్ణి ప్రశ్నిస్తున్నాడు.

నవ్యాంధ్ర రాజధాని కోసం ప్రభుత్వం అక్కడి రైతుల నుంచి సుమారు 33 వేల ఎకరాలు సమీకరించింది. బదులుగా కొన్ని నివాస, వాణిజ్య స్థలాలు వాళ్లకు కేటాయించింది. అయితే రాజధాని ఉట్టికి స్వర్గానికి కాకుండా పోయింది. రాజధాని కావాలని అక్కడి రైతులు అడగలేదు. వాళ్ల భూములు ప్లాట్లుగా మారినాకే మొదలైంది అసలైన దుఃఖం.

'ఉన్న కన్నీళ్లకు తోడు ఇప్పుడొక కొత్త దుఃఖం
మనుషుల్ని ప్రాంతాలుగా
ప్రాంతాల్ని కులాలుగా
రంగులు పూసిన చేతులు చేసిన దుఃఖం'

రాజధాని స్వప్నాన్ని అపహాస్యం చెయ్యటానికి కారణమేమిటి? ఆ ప్రాంతం ప్రజలు చేసిన నేరమేమిటి? మనుషుల మీద కులాల ముద్ర వేసి, అభివృద్ధిని నేలమట్టం చెయ్యటమేమిటి? ఈ ప్రశ్నలన్నీ 'మరొక దుఃఖం' చదివినాక తప్పకుండా మెదులుతాయి. ఎవరు వినగలరు 'ఆకు రాలిన చప్పుడు'? 'రెక్కలు ముడిచిన పావురం మాటలు'? చలం అన్నట్టు 'కాలికింద నలిగిన చీమల కాళ్ల విరిగిన చప్పుడు'? ఎడతెరిపి లేని నగర ఘోష మధ్య ఒంటరి గదిలో, లోపలి వెలితిలో, పంచేంద్రియాలతో ఆత్మిక, భౌతిక ప్రకంపనల్ని పసిగడుతున్నాడు కవి. మిక్కిలి సున్నితమైన మనస్సు ఉంటేనే గాని మౌనం సాధ్యం కాదు. మౌనంలో ఉంటేనే గాని చిరుగాలి సవ్వడినో, ఆకురాలిన చప్పుడునో వినటం సాధ్యం గాదు. జెన్ కవులు సాధించింది అదే. విశ్వంలో మనిషి - ప్రకృతి మధ్య అంతస్సంబంధాన్ని గుర్తించటం కవులకే గాదు, మనుషులందరికీ ఆత్మికావసరమే.

'వెతుక్కోవడం' వంటి కవితలు చదివినప్పుడు ఈ కవిలో ఉద్బుద్ధమవుతున్న తాత్వికత గోచరిస్తుంది. 'మనల్ని మనం వెతుక్కోవాలంటే/ మనల్ని మనం కోల్పోతుండాలి కదా!' అంటున్నాడు. నిజానికి ఆధునిక మానవుడు ఏ జీవన మాధుర్యం కోల్పోతున్నాడో తెలుసుకోవటం లేదు. ఏ సారాంశం కోసం తపించాలో కూడా తెలుసుకోవటం లేదు. భౌతిక లాలసలో తిరుగుడు పడుతూ బతుకు సంతలో తనంతట తనే తప్పిపోతున్నాడు. మనలో పేరుకున్న మడ్డిని తొలగించుకున్నప్పుడే చేర్చుకోవాల్సిన సారం అర్థమవుతుంది.

ఊహాశాలి ఈ కవి. చంద్రుడి గురించిన వర్ణనలో నూతనత్వం చూడండి. 'ఈ పాటికే కథలతో చెరువు మీద వాలాల్సిన అతిథి/ చుక్కల్ని కప్పిన దీపాల దారిలో తప్పిపోయాడేమో / లేదా అదే దీపంలో కలిసిపోయి/ ఎక్కడో స్మృతి కవితగా రాలాడేమో'. 'అప్పుడప్పుడూ...' కవిత మనిషికి దుఃఖం ఎంత అవసరమో చెప్తుంది. 'అప్పుడప్పుడూ ఏడవాలి/ కొద్దిగా బరువుల్ని జార్చుకోడానికే కాదు/ జ్ఞాపకాల్ని ఇంకొంచెం మోయడానికి/ జీవితాన్ని ఇంకొంత కొలవడానికి/ కొన్ని విత్తనాల్ని దుఃఖంతో నాటడానికి'. దుఃఖమనేది భారాన్ని దించుకోవడానికి మాత్రమే కాదు. జ్ఞాపకాల భారాన్ని ఇంకొంచెం మోయడానికి, జీవితాన్ని ఇంకొంత కొలవడానికి కూడా అని చెప్పటం నూతన అభివ్యక్తి. కవితలోని మూడు శకలాల్లో ముగ్గురి కోణం నుంచి విషయాన్ని వ్యక్తం చేయటం అనే కొత్త రూపాన్ని ఎంచుకున్నాడు 'ఇద్దరి కథ కాదు' కవితలో. కులాల మధ్య ఏర్పడిన అపనమ్మకాన్ని తొలగించుకోలేకపోవటం పట్ల ఆవేదనను, అందరూ కలిసిపోవాలన్న ఆశను వ్యక్తం చేసిన కవిత ఇది. రెండు వైపుల వారి వాదాలు, దూరాల్ని తొలగించుకొని పచ్చపచ్చగా కొత్త ఊపిర్లు అందుకోవాలన్న కవి కోరిక ఇందులో వ్యక్తమయ్యాయి.

'మీసం ముద్దు'లాంటి సరళమైన, స్వభావోక్తి సుందరమైన కవితలు రాయగలిగినా ఒక్కొక్క చోట ఈ కవి తనకి మాత్రమే అర్థమైన విషయం చెపుతాడు. అటువంటి చోట్ల పాఠకుడికి కూడా అర్థమయ్యే సూత్రం కాస్త అందిస్తే అస్పష్టతా మేఘాలు తొలగిపోతాయి. ముందు ముందు ఈ వర్ధిష్ణువు కవితానిర్మాణంలో తెగిపోని భావధార గురించి, అలంకారికతలో భావచిత్రాల కుదిరిక గురించి మరి కాస్త శ్రద్ధ తీసుకోగలడు. విభిన్నమైన వస్తువుల్ని తీసుకొని కవితాశిల్పాలు చెక్కుతున్న ఈ కవి 'ఇప్పటికైతే వట్టి మట్టిముద్దని మాత్రమే' అని వినమ్రంగా చెప్పుకుంటున్నాడు. 'కాలం జరిగాక తవ్వి చూస్తే శిలగా మిగులుతానో/ శిల్పమై ఎదురొస్తానో/ శిలాజంగా దొరుకుతానో' అంటున్నాడు. కానీ చక్కని శిల్పమై మనకు ఎదురొస్తాడన్న నమ్మికతో ఈ కవి కుమారుడిపై శుభాక్షతలు చల్లుతున్నాను.

- పాపినేని శివశంకర్

నానీలతో నాన్నకు పట్టాభిషేకం



జీవితాన్నిచ్చిన నాన్న పట్ల తన అంతరంగ భావాలను పాతిక అక్షరాల్లో అభివ్యక్తీకరించిన తీరు అద్భుతం, అభినందనీయం. నాన్నకు ప్రేమ పూర్వకంగా అందించిన కతజ్ఞతా కావ్యం 'నాన్న నానీలు'. ఇందులో 107 నానీలు నాన్నను అభిషేకించాయి. కుటుంబ పోషణకు నాన్న మోసిన బరువులు, బాధ్యతలు, చిందించిన స్వేదం, కరిగించిన కండరాల, నరాల సత్తువను చిత్రిక పట్టి దుర్భిణీ వలే నానీల్లో దర్శింపజేస్తాడు కవి వెన్నెల సత్యం.

నాన్నగా బాధ్యతలు నెరపుటలో పడిన శ్రమ, కుటుంబం, పిల్లలు, తలిదండ్రులు, బంధువులు, సమాజం అన్ని అంశాలలో నడుచుకున్న తీరు బాల్యం నుండి గమనించివాడు కావడం నాన్న బాధలను బరువులను స్వగతంగా 'నానీలు'గా చిత్రికపట్టాడు.

నాన్న శ్రమను, త్యాగాన్ని ఉచితమైన ప్రతీకలతో నానీలుగా ప్రతిధ్వనింపజేసినా.. ఇందులో అందరి నాన్నల శ్రమ, బాధలు, త్యాగాలు సార్వజనీనమై ప్రతిబింబిస్తాయి. నాన్నగా మారితే గాని నాన్న బాధ్యతేమిటో, విలువేమిటో, పిల్లలకు ఆయన మార్గదర్శనమేమిటో, తన కష్టాలను దాచుకొని, పిల్లల ఆకలి తీర్చడానికి తను కడుపుమాడ్చుకొని పస్తులుండిన రోజులు గుర్తుకు తెస్తాయి.

కుటుంబం, పిల్లల ఉన్నతిని కాంక్షించే సగటునాన్న పడే తపనను మథిస్తాయి. కష్టాలన్నీ నాన్నే ఓపికతో భరిస్తాడు.పిల్లలకు తెలియనీయక.. తానెప్పుడూ కష్టాలలోనే మిగిలిపోతాడు.. ఈ నానీ చూడండి.

నాన్నంటే
అలుపెరుగని అల
బిడ్డల్ని ఒడ్డుకు చేర్చి
తాను సంద్రం లోనే

పిల్లల ఎదుగుదలకు కారణమయ్యే నాన్న ఆఖరిమజిలీలో అనాథగా ఆదరణ లేక బతుకుతాడని హృద్యంగా చెప్పిన ఈ నానీ చదవండి..

నాడేమో
కొండల్ని పిండి చేశాడు
నేడేమో ఆశ్రమంలో
గుండెల్ని పిండేస్తూ..!

నానీలో కొందరి నాన్నల నేటి స్థితిని ఆర్ద్రంగా పలికిస్తాడు. నాన్నమాటలు అప్పటికి కటువుగా ఉన్నా పిల్లల భవిష్యత్తు బాగుకు రత్నాల్లా విలువైనవేనంటాడు మరో నానీలో. నాన్న వత్తిని ఉటంకిస్తూ..ఆయన వాడిన పనిముట్లూ తనకు విలువైనవే నంటాడు బిడ్డలు గెలుపు కోసం నాన్నెప్పుడూ ఓడిపోతూనే ఉంటాడనీ బిడ్డలు ఎదుగుటలో తన పాత్ర ఉన్నా లేకున్నా సాధింపులూ ఈసడింపులూ ఆయనకే చెల్లుతాయని, సంపదలు కూడబట్టకపోయినా.. నాన్నను గుండెలో దైవంగా కొలవాలని కవి తన అంతరంగాన్ని ఆవిష్కరిస్తాడు.

కుటుంబం గడవడానికి నాన్న లెక్కలు నాన్నవి.పిల్లలకు అవి అర్థం కాని ఛాదస్తపు లెక్కల్లా తోస్తాయి. సాధించింది.. సంపాదించిదంతా బిడ్డలకు ప్రేమపంచి నంక నాన్న ఇంకా ఏమీ మిగుల్చుకోని గుండెలేని మనిషేనంటాడు. నాన్నంటే భయపెట్టే భూతం కాదు భవిష్యత్తు దర్శింజేసే భూతద్దమని ఆయన గొప్పతనాన్ని కీర్తిస్తాడు..

ఆస్తులు కూడబెట్టడం ఎన్నోపాట్లు పడినా ఆఖరుకు అనాథాశ్రమంలో కాలం వెళ్ళబుస్తున్న కొందరి నాన్నల దీనస్థితిని...నేటి సమాజపోకడలు, అయినవారి అనాదరణను విశ్లేషిస్తారు కవి.

మంచినీటి చెలిమె అందరికీ ఉపయోగకరం

ఉప్పునీటి చెలిమె ఎవరికీ పనికిరాదని, వార్ధక్యంలో నాన్నా ఆ ఉప్పుచెలిమెననీ, ఎవరికీ పట్టరనీ తన బాధను వెళ్ళగక్కుతారు కవి. నాన్న ఔన్నత్యాన్ని చాటిన నానీ ఇది.

నాన్న మాయలోడు
మాకన్నీళ్ళను
ఆనందభాష్పాలుగా
మారుస్తాడు మరి!

అందిరికీ నాన్నయ్యాకే అనుభవంలోకి వస్తాయని మరో నానీలో వెలిబుచ్చుతాడు.భౌతికంగా తన నాన్న తనను వీడడం తనకెంత బాధాకరమో, ఆయన తన జీవితానికి అందించిన నిచ్చెనలు, మిగిల్చిన గుర్తులను తలచుకొని కుమిలిపోతుంటారు..

తింటున్న జిలేబీ
చేదయ్యింది
పొట్లాం మీద
నాన్న నిర్యాణం ఫోటో

నాన్న చిందించిన చెమటే పిల్లల ఉన్నతికి బాటలు వేస్తుందని నాన్న శ్రమను ప్రేమగా నిమురుతాడు.

ఇలా 107 నానీలలతో నాన్న ప్రేమను, త్యాగాన్ని, విలువను, జీవితానికి నాన్న గొప్పతనాన్ని, నాన్నపట్ల తనకుగల ప్రేమనూ,అనుబంధాన్ని బహుగొప్పగా కీర్తిస్తూ వెన్నెల సత్యం అక్షరాభిషేకంచేసారు. కవిత్వంలో, సాహిత్యంలో వెనుకబడిన నాన్నకు ఈ కతి నిజంగా "నాన్నకు పట్టాభిషేకం" చేసిందనుటలో అతిశయోక్తిలేదు. (పుస్తకం పేజీలు: 44 వెల: 60/- వివరాలకు.. రచయిత వెన్నెల సత్యం 9440032210)

- మధు జెల్లా
9398340075.

14న ఢిల్లీలో బిఆర్‌ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయ ప్రారంభం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలోని సర్దార్ పటేల్ మార్గ్‌లో భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) పార్టీ కేంద్ర కార్యాలయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 14న ప్రారంభించనున్నారు. అదే రోజు నిర్వహించనున్న యాగానికి, ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను తెలంగాణ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ పరిశీలించారు.

బిజెపి ఢిల్లీ చీఫ్ రాజీనామా

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి ఓటమితో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా ఆదివారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఓటమికి బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా సూచనల మేరకు ఢిల్లీ బిజెపి చీఫ్ పదవికి ఆదేశ్ గుప్తా రాజీనామా చేయగా, అధిష్టానం ఆమోదించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఢిల్లీ బిజెపి ఉపాధ్యక్షుడిగా ఉన్న వీరేంద్ర సచ్‌దేవను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు.

ఆర్‌ఎస్‌ఎస్ నేత ఇంట్లో బిజెపి కార్యకర్త ఆత్మహత్యాయత్నం

పరవూరు : ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు, పూతకులం నిధి బ్యాంక్ పాలక మండలి సభ్యుడు పూతకులం చెకంతజికం అనూప్ నివాసంలో ఓ మహిళ శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం కలైకోడ్‌కు చెందిన ఓ మహిళ శనివారం అనూప్ ఇంటికి చేరుకుంది. అనూప్ తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, ఇవ్వడానికి నిరాకరించాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. అనూప్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం అనూప్ ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఆ మహిళ ఉరి వేసుకుని కనిపించింది. ఘటన జరిగిన సమయంలో అనూప్ సోదరి ఇంట్లోనే ఉంది. యువతి కనిపించకపోవడంతో అక్కడికి ఆమె బంధువులు చేరుకోగా, తలుపులు తీయలేదు. కిటికీలోంచి చూసేసరికి గదిలో ఉరికి వేలాడుతూ మహిళ కనిపించింది. స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి ఆమెను రక్షించారు. కొల్లం గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో బాధిత మహిళ చికిత్స పొందుతున్నారు.

అందుబాటులో డయాబెటిస్ ఫ్రెండ్లీ ఫుడ్

- కేంద్రాన్ని ఆదేశించాలని సిజెఐకి పొత్తూరి భారతి ఫౌండేషన్ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో డయాబెటిస్ ఫ్రెండ్లీ ఫుడ్ (మధుమేహం రోగులకు ఉపయోగపడే ఆహారం) అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు పొత్తూరి భారతి ఫౌండేషన్ ఛైర్మన్, సుప్రీం కోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిజెఐ డివై చంద్రచూడ్‌కు ఆయన మూడు పేజీల వినతిపత్రం అందజేశారు. దేశంలో 2019 నాటికి 7.7 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారని, 2045 నాటికి ఈ సంఖ్య 13.4 కోట్లకు పెరుగుతుందని గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ప్రతి వంద మందిలో 15 మంది మధుమేహంతో బాధపడుతున్నారని, చిన్నారుల నుంచి వృద్ధాప్యం వరకు అందరూ వయసుతో నిమిత్తం లేకుండా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లలో మధుమేహ బాధితులకు ఉపయోగపడేలా 10 నుంచి 15 శాతం ఆహారం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అందుకు అనుగుణంగా ఆయా హోటళ్లు, రెస్టారెంట్లకు లైసెన్స్‌లు ఇచ్చినప్పుడు ఈ నిబంధన పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంస్థల్లో ఉన్న క్యాంటీన్లలో కూడా మధుమేహ బాధితుల సౌకర్యార్థం డయాబెటిస్ ఫ్రెండ్లీ ఫుడ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రికి వినతి పత్రం సమర్పించామని, కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని సిజెఐకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా తీసుకొని, కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని సిజెఐ జస్టిస్ చంద్రచూడ్‌ను కోరారు.

పెడ్రో క్యాస్టిల్లోపై హెబియస్ కార్పస్ పిటిషన్ కొట్టివేత

లిమా : పెరూ మాజీ అధ్యక్షులు పెడ్రో క్యాస్టిల్లోపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటీషన్‌ను ఆ దేశంలోని మూడో రాజ్యాంగ కోర్టు తిరస్కరించింది. ఈ పిటిషన్ ఆమోదయోగ్యం కాదని తెలిపింది. మాజీ అధ్యక్షులు క్యాస్టిల్లోను పోలీసులు నిర్బంధించిన విధానం సరికాదని ఆరోపిస్తూ క్యాస్టిల్లో తరుపు న్యాయవాది దాఖలు చేసిన ఈ పిటిషన్ ఆమోదయోగ్యం కాదని జడ్జి జాన్ పరేడెస్ ప్రకటించారు. కోర్టు ఇచ్చిన తీర్పుతో క్యాస్టిల్లో తక్షణ విడుదల ప్రశ్నార్థకరంగా మారింది. క్యాస్టిల్లోను తక్షణమై విడుదల చేయాలని దేశంలో సామాజిక సంస్థలు విజ్ఞప్తి చేశాయి. ఈ నెల 15న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. క్యాస్టిల్లో అరెస్టుకు నిరసనగా రాజధాని లిమాతో సహా అనేక పట్టణాల్లో భారీఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. బుధవారం ప్రతిపక్షం ఆధీనంలో ఉన్న పెరూ పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టి పెడ్రో క్యాస్టిల్లోను అధ్యక్ష పదవిలోంచి దించివేశారు. అభిశంసన తీర్మానం ఆమోదం పొందిన కొన్ని గంటల్లోనే పోలీసులు క్యాస్టిల్లోను అరెస్టు చేశారు.

గుజరాత్ అసెంబ్లీలో నేరచరితులు

- ఇరవై ఆరుగురు బిజెపి ఎమ్మెల్యేలుసహా 40 మందిపై క్రిమినల్ కేసులు
- ఒకరు లైంగికదాడి కేసులో నిందితుడు
- ఎడిఆర్ నివేదిక



గాంధీనగర్ : గుజరాత్ అసెంబ్లీకి తాజాగా ఎన్నికైన 182 మంది ఎమ్మెల్యేల్లో 40 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా (26మంది) బిజెపి ప్రజాప్రతినిధులే ఉండటం విశేషం. లైంగికదాడి కేసులో ఒక బిజెపి ఎమ్మెల్యే నిందితుడుగా ఉన్నాడు. వేధింపుల కేసులో కాంగ్రెస్, ఆప్, బిజెపిలకు చెందిన ఒక్కొక్క ఎమ్మెల్యే నిందితులుగా ఉన్నారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదికలో ఈ విషయం వెల్లడైంది. గత ఎన్నికలతో పోలిస్తే తాజా ఎన్నికల్లో క్రిమినల్ కేసుల్లో నిందితుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని వివరించింది. ఎడిఆర్, గుజరాత్ ఎలక్షన్ వాచ్ మొత్తం 182 మంది ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్‌లను విశ్లేషించాయి.

ఈ నివేదిక ప్రకారం.. కొత్తగా ఎన్నికైన 40 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ 40 మంది ఎమ్మెల్యేల్లో 29 మంది సభ్యులకు (మొత్తం 182 మందిలో 16 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉంది. వీరిలో హత్యాయత్నం, లైంగికదాడి వంటి తీవ్ర ఆరోపణలు ఉన్న వారు ఉన్నారు. ఈ 29 మందిలో 20 మంది బిజెపి, నలుగురు కాంగ్రెస్, ఇద్దరు ఆమ్ ఆద్మీ పార్టీ, ఇద్దరు స్వతంత్రులు, సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఒకరు ఉన్నారు.

26 మంది బిజెపి ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 156, కాంగ్రెస్ 17, ఆప్ 5 స్థానాలు గెలుచుకున్నాయి. ఎడిఆర్ అధ్యయనం ప్రకారం.. 156 మంది బీజేపీ ఎమ్మెల్యేలలో 26 మంది (17 శాతం), కాంగ్రెస్‌కు 17 మందిలో 9 (53 శాతం), ఐదుగురు ఆప్ ఎమ్మెల్యేల్లో ఇద్దరు (40 శాతం), 3 మంది స్వతంత్రులు (68 శాతం) క్రిమినల్ కేసుల్లో ఉన్నారు. తనపై క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నదని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే కంధాల్ జడేజా ప్రకటించారు. 2017లో 47 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

ముగ్గురు ఎమ్మెల్యేలపై హత్యాయత్నం ఆరోపణలు

ఐపిసి సెక్షన్ 307 (హత్యా ప్రయత్నం) కింద కేసులు ఎదుర్కొంటున్నట్టు ముగ్గురు ఎమ్మెల్యేలు ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. వీరిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశదా అనంత్ పటేల్, కాంగ్రెస్ ఎమ్మెల్యే పటాన్ కిరీట్ పటేల్ , బిజెపి ఎమ్మెల్యే ఉనా కాళూభాయ్ రాథోడ్ ఉన్నారు.

మహిళలకు సంబంధించిన నేరాల్లో..

ఐపిసి సెక్షన్ 354 (మహిళలను అవమానించడం / వేధించడం) లేదా సెక్షన్ 376 (లైంగికదాడి) కింద నలుగురు ఎమ్మెల్యేలు కేసుల్లో ప్రమేయం ఉన్నారని కూడా అధ్యయనం వెల్లడించింది. ఈ నలుగురిలో బిజెపికి చెందిన జేథా భర్వాద్‌పై లైంగికదాడి ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ, బిజెపి ఎమ్మెల్యే జనక్ తలావియా, ఆప్ ఎమ్మెల్యే చైత్ర వాసవలపై ఐపిసి సెక్షన్ 354 కింద అభియోగాలు నమోదై ఉన్నాయి.



హిమాచల్‌ప్రదేశ్ సిఎంగా సుఖ్వీందర్ సింగ్ సుఖుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ రాజేంద్ర అర్లేకర్

హిమాచల్ గద్దెపై సుఖ్వీందర్

ఉప ముఖ్యమంత్రిగా ముఖేష్ అగ్నిహోత్రి ప్రమాణ స్వీకారం

సిమ్లా : నాలుగు సార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే , ఓ బస్ డ్రైవర్ కుమారుడు సుఖ్వీందర్ సింగ్ సుఖు (58) హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా గత అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించిన ముఖేష్ అగ్నిహోత్రి (60) బాధ్యతలు చేపట్టారు.. సిమ్లాలోని రిడ్జ్ మైదానంలో అట్టహాసంగా జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రివర్గంలో 12 మంది ఉండవచ్చునని భావిస్తున్నారు. అంతకుముందు మాజీ ముఖ్య మంత్రి వీరభద్రసింగ్ చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాల వేసి, నివాళులర్పించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు భూపేష్ బాఘేల్, అశోక్ గెహ్లాట్, సుఖు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 68 సీట్లున్న అసెంబ్లీలో కాంగ్రెస్ 40 సీట్లు గెలుచుకున్న సంగతి తెలిసిందే.

ఒపిఎస్‌సహా 10 హామీలనూ అమలు చేస్తాం

పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) సహా పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన పది హామీలను అమలు చేస్తామని హిమాచల్ ప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖు హామీ ఇచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం భారీగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. పారదర్శకమైన, నిజాయితీ గల ప్రభుత్వాన్ని అందిస్తామన్నారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త వ్యవస్థను, కొత్త ఆలోచనలను అమలులోకి తీసుకొచ్చేందుకు కష్టపడి పనిచేస్తామని చెప్పారు.

సామాన్య కుటుంబం నుంచి సిఎం వరకూ...

వృత్తిరీత్యా న్యాయవాది అయిన సుఖు సామాన్య కుటుంబం నుంచి ఎదిగారు. ఆయన తండ్రి రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్‌గా పనిచేశారు. సుఖు ఒకప్పుడు పాలు విక్రయించారు. సిమ్లాలోని హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీలో చదువుతూ సామాజిక కార్యకర్తగా ఎదిగారు. 1980ల్లో నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా స్టేట్ చీఫ్ బాధ్యతలు చేపట్టారు. పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వచ్చాక 2000లో స్టేట్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షులయ్యారు.

2003లో తొలిసారి మొదలు.. నాదౌన్ అసెంబ్లీ స్థానం నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు గెలుపొందారు. 2019లో ప్రతిభాసింగ్ బాధ్యతలు చేపట్టే వరకు పిసిసి చీఫ్‌గా పనిచేశారు. 58 ఏళ్ల సుఖుకు రాహుల్ గాంధీకి సన్నిహితుడిగా పేరుంది. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించి. పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. బిజెపికి చెందిన ప్రేమ్ కుమార్ ధుమాల్ తర్వాత.. హమీర్‌పూర్ జిల్లా నుంచి ఆయన రెండో ముఖ్యమంత్రి కానున్నారు.

ట్విట్టర్ సర్వర్ డౌన్..!

లండన్ : సాంకేతిక సమస్యల కారణంగా ట్విట్టర్ సర్వర్ డౌన్ అయ్యింది. పలువురు వినియోగదారులు రాత్రి 7 గంటల తర్వాత పలు సమస్యలు ఎదుర్కొన్నట్టు ఫిర్యాదు చేశారు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్‌లో 1,747 మంది వినియోగదారులు ట్విట్టర్‌లో సమస్యలు ఎదుర్కొన్నట్లు తెలిపారు.

క్రిస్మస్ వేళ బ్రిటన్‌లో అతిపెద్ద సమ్మె..

రైల్, విమాన సర్వీసులకు అంతరాయం

లండన్ : క్రిస్మ స్ వేళ బ్రిటన్‌లో పెద్ద ఎత్తున సమ్మె జరుగుతున్నది. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు, పింఛన్లు పెంచాలన్న ప్రధాన డిమాండ్‌తో జరుగుతున్న ఈ సమ్మెలో బస్సు, రైల్వే, విమానం, అంబులెన్స్, నర్సింగ్, పోస్టల్, టీచింగ్ సిబ్బంది సహా వివిధ విభాగాలకు చెందిన రెండు లక్షలకు పైగా ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఫలితంగా అన్ని రకాల సేవలు బ్రిటన్‌లో నిలిచిపోనున్నాయి. గత 30 ఏళ్లలో ఇదే అతిపెద్ద సమ్మెగా భావిస్తున్నారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు ఈ సమ్మె ఒక ఛాలెంజ్‌గా నిలిచిందని రాజకీయ, ఆర్థిక పరిశీలకులు భావిస్తున్నారు. ప్రతి శాఖ ఉద్యోగులకు వేర్వేరు డిమాండ్లు ఉండగా.. అందరి ఉమ్మడి డిమాండ్ మాత్రం జీతాలు పెంచడం. ద్రవ్యోల్బణం ఏ స్థాయిలో పెరుగుతుందో.. తమ జీతాలు అదే వేగంతో పెరగడం లేదని ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. యూకేలో ద్రవ్యోల్బణం రేటు 11.1 శాతంగా ఉన్నది. కాగా, నర్సింగ్ సిబ్బంది జీతం 4.75 శాతం, అంబులెన్స్ సిబ్బంది జీతం 4 శాతం పెరిగింది. పోస్టల్ ఉద్యోగులకు 9 శాతం వేతన పెంపును ప్రతిపాదించగా, వారు తిరస్కరించారు. తొలుత ఈ నెల 7న ఉపాధ్యాయులు సమ్మెకు దిగారు. జీతం పెంచడంతో పాటు పించన్ పెంచాలన్నది వారి ప్రధాన డిమాండ్. గాట్విక్, హీత్రో, మాంచెస్టర్, బర్మింగ్‌హామ్, గ్లాస్గో, కార్డిఫ్‌లలో విమానాశ్రయ సిబ్బంది ఈ నెల 23 నుంచి 26 వరకు, తిరిగి ఈ నెల 28 నుంచి 31 తేదీలలో సమ్మెలో ఉంటారు. సమ్మె ప్రభావాన్ని నివారించేందుకు ఎయిర్‌పోర్టులు, ఓడరేవుల వద్ద సైన్యాన్ని మోహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 40 వేల మంది రైల్వే కార్మికులు ఈ నెల13 నుంచి 17 వరకు సమ్మె చేయనున్నారు. ఈ నెల 15, 20 తేదీల్లో దాదాపు లక్ష మంది నర్సులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 21, 28 తేదీల్లో 10 వేల మంది అంబులెన్స్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారు.



మూడు నెలలు గడిచినా...

- ఇంకా పూర్తి కాని బెయిల్ ష్యూరిటీల ధ్రువీకరణ

లక్నో : యుఎపిఎ కేసులో అరెస్టయిన జర్నలిస్టు సిద్ధికీ కప్పన్‌కు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం బెయిల్ ష్యూరిటీలు సమర్పించి మూడు నెలలు గడిచినా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వాటిని ఇంకా పెండింగ్‌లోనే ఉంచింది. దీనిపై కప్పన్ భార్య రైహానాత్ కప్పన్ భార్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సమర్పించిన బెయిల్ ష్యూరిటీలను ధ్రువీకరించడంలో అంతులేని జాప్యం సమర్థనీయం కాదని అన్నారు. 'సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మూడు నెలల తరువాత కూడా బెయిల్ షరతుల ధ్రువీకరణ ఇంకా పూర్తి కాలేదని తెలుసుకుని తీవ్ర నిరాశ చెందాము' అని చెప్పారు. యుఎపిఎ కేసులో సెప్టెంబరు 9న సుప్రీంకోర్టు కప్పన్‌కు బెయిల్ మంజూరు చేసింది. 'దేశంలో ప్రతీ పౌరుడికి భావ వ్యక్తీకరణ హక్కు ఉంది' అని సుప్రీంకోర్టు తెలిపింది. ఇడి నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో బెయిల్ రాకపోవడంతో కప్పన్ ఇంకా జైలులోనే ఉన్నారు. బెయిల్ ష్యూరిటీలు ధ్రువీకరణ పూర్తి చేయకపోవడంపై కప్పన్ న్యాయవాది మహమ్మద్ ధనిష్ కెఎస్ మాట్లాడుతూ 'న్యాయం ఆలస్యమైతే న్యాయం నిరాకరణకు గురవుతుంది' అని వ్యాఖ్యానించారు.



సిద్ధికీ కప్పన్

మళ్లీ మలేరియా

- భారత్ సహా 4 ఆఫ్రికా దేశాల్లో అధికం



న్యూయార్క్: కరోనా మహమ్మారి వ్యాప్తి కారణంగా మలేరియా నివారణ చర్యలకు ఆటంకం కలిగిందని, దీంతో మలేరియా కేసులు, మరణాలు పెరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) వెల్లడించింది. 'వరల్డ్ మలేరియా రిపోర్ట్-2022'ను ప్రపంచ ఆరోగ్య సంస్థ శనివారం విడుదల చేసింది. మొత్తం 11 దేశాల్లో మలేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయని.. భారత్‌తో పాటు కాంగో, ఘనా, నైగర్, టాంజానియాల్లో తీవ్రత అధికంగా ఉందని వివరించింది. ఈ దేశాల్లో మలేరియా మరణాలు తగ్గినట్లు వెల్లడించింది. మరణాల్లో 96 శాతం 29 దేశాల నుంచే సంభవిస్తున్నట్లు నివేదించింది. 2020లో మలేరియా మరణాల సంఖ్య 6.25 లక్షలు కాగా, 2021 నాటికి 6.19 లక్షలకు తగ్గాయని వెల్లడించింది. కొవిడ్‌కు ముందు.. 2019లో మృతుల సంఖ్య 5.68 లక్షలుగా ఉన్నట్లు పేర్కొంది. 2019తో పోల్చితే 2020లో మరణాలు పదిశాతం పెరిగాయని డబ్ల్యుహెచ్‌ఒ పేర్కొంది. 2021లో మొత్తం 24,70 కోట్ల మలేరియా కేసులు నమోదవ్వగా.. 2020లో వాటి సంఖ్య 24.50 కోట్లని తెలిపింది. 2019లో ఆ సంఖ్య 23.20 కోట్లేనని పేర్కొంది. ఆగ్నేయాసియా ప్రాంతంలో నమోదయ్యే మొత్తం కేసుల్లో 79 శాతం, మరణాల్లో 83 శాతం భారత్ నుంచే వస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మలేరియా అంతానికి ప్రస్తుతం దేశాలు తీసుకుంటున్న చర్యలు సమర్థంగా లేవని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ మలేరియా నియంత్రణ, నిర్మూలనలో తాజా పోకడలపై సమాచారాన్ని అందిస్తుంది. ఈ సంవత్సరం నివేదికలో 3 కొత్త విభాగాలు ఉన్నాయి. 1) 2021, 2022లో ప్రారంభించబడిన ప్రపంచ, ప్రాంతీయ కార్యక్రమాలు (2) గ్లోబల్ మలేరియా నిఘా. నిఘా వ్యవస్థల అంచనాలపై దేశ-స్థాయి కేస్ స్టడీస్ (3) పరిశోధన, అభివద్ధి. నివేదికలో మలేరియా నియంత్రణకు వచ్చే ముప్పులపై విస్తరించిన విభాగాన్ని కూడా చేర్చింది.



వచ్చే ఏడాది మధ్యనాటికి గ్వాంగ్‌జౌలో కోవిడ్ ముందు నాటి పరిస్థితులు

బీజింగ్ : దక్షిణ చైనాలోని గ్వాంగ్‌డాంగ్ రాష్ట్రంలోని గ్వాంగ్‌జౌలో కోవిడ్ కేసుల మొదటి దశ వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో గరిష్ట స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ప్రముఖ అంటువ్యాధుల నిపుణులు జాంగ్ నాన్షాన్ తెలిపారు. వచ్చే ఏడాది మధ్య నాటికి కోవిడ్ ముందు నాటి పరిస్థితులకు తిరిగి వస్తుందని చెప్పారు. కోవిడ్‌తో కలిగే తీవ్రమైన అనారోగ్యాన్ని నివారించడానికి కోవిడ్ వ్యాక్సినేషన్‌ను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. చైనాలో తయారైన కోవిడ్ టీకాలు విదేశీ టీకాల కంటే తక్కువ దుష్ప్రభావాన్ని కలిగిస్తాయని, విదేశీ టీకాల కంటే సురక్షితమైనవని తెలిపారు. టీకాల సహాయంతో కోవిడ్ సోకినవారు వారం నుంచి ఏడు రోజుల లోపు పూర్తిగా కోలుకోగలరని చెప్పారు. కోవిడ్ మహమ్మారి ఇంకా ముగియలేదని జాంగ్ తెలిపారు. ఒమిక్రాన్ వేరియంట్ వ్యాధి తీవ్రత చాలా క్షీణించిందని పేర్కొన్నారు. జాంగ్ వ్యాఖ్యలను చైనాకు చెందిన ప్రముఖ ఎపిడెమియాలజిస్టు లీ లాంజువాన్ సమర్థించారు.

చైనా-అరబ్ సహకారంతో 200 కోట్ల మందికి ప్రయోజనం

బీజింగ్ : చైనా-అరబ్ దేశాలు 200కు పైగా భారీ ప్రాజెక్టులు చేపట్టాయని, ఈ ప్రాజెక్టులతో 200 కోట్లమందికి పైగా ప్రజలు లబ్ధి పొందారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చైనా, అరబ్ దేశాల బెల్ట్ అండ్ రోడ్ కోపరేషన్ నిర్మాణత్మాకంగానూ, ఫలవంతంగానూ మారిందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. బీజింగ్‌లో ఇటీవల ఒక మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'చైనా, అరబ్ దేశాలు సంయుక్తంగా మౌలిక సదుపాయాలు, ఇంధనం, ఇతర రంగాల్లో 200 కంటే భారీ స్థాయి ప్రాజెక్టులను చేపట్టాయి. దీంతో రెండు దేశాలకు చెందిన 200 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందుతున్నారు' అని చెప్పారు. ప్రస్తుతం ఫిఫా ప్రపంచకప్ జరుగుతున్న ఖతార్‌లోని లుసైల్ స్టేడియం, ఈజిప్టులోని మొదటి విద్యుతీకరణ రైల్వే లైన్ కూడా చైనా-అరబ్ దేశాల మధ్య సహకారంతో నిర్మించినవే అని ఆమె గుర్తు చేశారు. అత్యున్నత నాణ్యత కలిగిన బెల్ట్ అండ్ రోడ్ కోపరేషన్ మరింతగా పెరిగితే అరబ్ దేశాల ప్రజలకు, ఇతర ప్రపంచ ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని చైనా నమ్మకంగా ఉందని మావో నింగ్ తెలిపారు.

ప్రతిపక్షాలపై ప్రధాని విసుర్లు

నాగ్‌పూర్ : దేశానికి సుస్థిరమైన అభివృద్ధి కావాలని, షార్ట్‌కట్ రాజకీయాలు కాదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. షార్ట్‌కట్ రాజకీయాలతో కొన్ని పార్టీలు దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రూ.75 వేల కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్‌కట్ రాజకీయాలతో పన్ను చెల్లింపుదారుల సొమ్ము దోపిడీ చేస్తూ, తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చే రాజకీయ నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

ఆరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన ప్రధాని

మహారాష్ట్రలోని నాగ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ మధ్య నడిచే ఆరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నాగ్‌పూర్ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోడీ ప్రారంభించారు. రూ.6,700 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో అభివృద్ధి చేయనున్న రైలు ప్రాజెక్టు ఫేజ్-2కి శంకుస్థాపన చేశారు. నాగ్‌పూర్‌లో జరిగే బహిరంగ కార్యక్రమంలో, సుమారు రూ.590 కోట్లతో నాగ్‌పూర్ రైల్వే స్టేషన్, రూ.360 కోట్లతో పునరాభివృద్ధి చేయనున్న అజ్నీ రైల్వే స్టేషన్‌ల పునరాభివృద్ధికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ప్రపంచం చూపు ఆయుర్వేదం వైపు

ఎన్నో చికిత్సా విధానాలను ప్రయత్నించిన తరువాత ప్రపంచం మళ్లీ ఆయుర్వేద వైద్యవిధానం వైపు చూస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గోవాలో జరుగుతున్న తొమ్మిదో ప్రపంచ ఆయుర్వేద సమావేశం (డబ్ల్యుఎసి), ఆరోగ్య ఎక్స్‌పో ముగింపు కార్యక్రమంలో ఆయన వైద్య నిపుణులను ఉద్దేశించి ప్రసంగించారు.

సుప్రీం జడ్జిగా జస్టిస్ దీపాంకర్ దత్తా



న్యూఢిల్లీ : ప్రస్తుతం బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ దీపాంకర్ దత్తాకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. గత ఏడాది సెప్టెంబరులో అప్పటి చీఫ్ జస్టిస్ యు యు లలిత్ నేతృత్వంలోని కొలీజియం సిఫారసుల్లో దత్తా పేరు ఉంది. కొలీజియం సిఫారసులను మోడీ ప్రభుత్వం తొక్కిపట్టడమే కాకుండా, కొలీజియంపై దాడికి దిగింది. మంత్రి కిరణ్ రిజిజు మొదలు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ దాకా కొలీజియం ప్రతిపత్తిపై ఎలా విరుచుకుపడినదీ పాఠకులకు విదితమే. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ నియామకానికి లైన్ క్లియరైంది. జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రమాణస్వీకారం తరువాత సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 28కి చేరుకుంటుంది. సుప్రీంకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 ఉండాలి. 1965 ఫిబ్రవరి 9న జన్మించిన దీపాంకర్ దత్తా 2030 ఫిబ్రవరి 8 వరకూ ఆ బాధ్యతల్లో ఉంటారు. 'భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124లోని క్లాజ్ (2) ద్వారా లభించిన అధికారాలను అమలు చేస్తూ, బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తాను భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడం పట్ల రాష్ట్రపతి సంతోషిస్తున్నారు. ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమలులోకి వస్తుంది' అని నోటిఫికేషన్‌లో న్యాయశాఖ మంత్రి పేర్కొన్నారు. జస్టిస్ దీపాంకర్ దత్తా పేరును గత ఏడాది సెప్టెంబర్‌లో జస్టిస్ యుయు లలిత్ (ప్రస్తుతం రిటైర్ అయ్యారు) నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలిజియం సిఫార్సు చేసింది. న్యాయమంత్రిత్వ శాఖ జారీ చేసిన మరొక నోటిఫికేషన్‌లో బాంబే హైకోర్టు తాతాల్కిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజయ్ విజయ్‌కుమార్ గంగా పూర్వాలా బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపింది. జస్టిస్ దత్తా 2006 జూన్ 22న కోల్‌కత్తా హైకోర్టు బెంచ్‌కు శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2020 ఏప్రిల్ 28న బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కోల్‌కత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సలీల్ కుమార్ దత్తా కుమారుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అమితవ రాయ్‌కు బావ జస్టిస్ దీపాంకర్ దత్తా.

లఖింపూర్ ఖేరీ కేసు సాక్షులపై వీరంగం..

- కత్తులతో దాడి చేసిన కేంద్ర మంత్రి కుమారుడి అనుచరులు

లక్నో: దేశవ్యాప్తంగా కలకలం రేపిన ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ కేసులో ప్రధాన నిందితుడైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడైన ఆశిష్ మిశ్రా అనుచరులు ఈ కేసులోని సాక్షులపై కత్తులతో దాడి చేశారు. ఈ దాడి నుంచి ఒక వ్యక్తి తప్పించుకోగా మరో వ్యక్తి గాయపడ్డాడు. గత ఏడాది అక్టోబర్ 3న కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడైన ఆశిష్ మిశ్రా, అతడి అనుచరులు లఖింపూర్ ఖేరీలో నిరసన చేస్తున్న రైతులపైకి వాహనాలు నడిపి తొక్కించి చంపారు. ఈ సంఘటనలో నలుగురు రైతులు, ఒక జర్నలిస్టు మరణించారు. అనంతరం జరిగిన అల్లర్లలో కొందరు బీజేపీ కార్యకర్తలు చనిపోయారు. సుప్రీంకోర్టు చీవాట్లతో దిగివచ్చిన యూపీ పోలీసులు చివరకు గత ఏడాది డిసెంబర్ 6న ఆశిష్ మిశ్రా, అతడి అనుచరులపై కేసు నమోదు చేశారు. మూడు రోజుల తర్వాత ఆశిష్ మిశ్రాను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు లఖింపూర్ ఖేరీ కేసులో సాక్షులైన ప్రబ్‌జ్యోత్ సింగ్, ఆయన తమ్ముడు సర్వజీత్ సింగ్ ఒక వేడుకకు వెళ్తుండగా కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడైన ఆశిష్ మిశ్రా అనుచరులు కత్తులతో దాడి చేశారు. ప్రబ్‌జ్యోత్ సింగ్ సురక్షితంగా బయటపడగా సర్వజీత్ సింగ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కాగా, తమపై జరిగిన దాడిపై పోలీసులకు ప్రబ్‌జ్యోత్ సింగ్ ఫిర్యాదు చేశాడు. కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడైన ఆశిష్ మిశ్రా పేరు కూడా పేర్కొన్నాడు. లఖింపూర్ ఖేరీ కేసుకు, ఈ దాడికి ఎలాంటి సంబంధం లేదని పోలీసులు తెలిపారు.

రైతన్న విలవిల

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న తిరుపతి జిల్లాలో వందలాది కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. వీరిని పునరావాస కేంద్రాలకు తరలించారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను ఆదుకొనేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు ముందుకువచ్చాయి. జిల్లా 76 ఇళ్లు దెబ్బతిన్నాయి. 600 ఎకరాల్లోపైగా వరి పంట నీట మునిగింది. వాగులు, నదుల ఉధృతితో దాదాపు 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మల్లిమడుగు, కల్యాణి డ్యాముల నుంచి నీటిని దిగువకు వదిలారు. సముద్రతీర ప్రాంతాలైన గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

'శ్రీవారి' క్షేత్రాన్ని కమ్మేసిన మంచు దుప్పటి

తిరుమల శ్రీవారి క్షేత్రంలో మంచు దుప్పటి కమ్మేసింది. చలి తీవ్రత అధికంగా పెరగడంతో శ్రీవారి సందర్శకులు వణికిపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చంటి పిల్లలతో వచ్చిన సందర్శకులు గదుల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

సంగం వద్ద భారీగా వరద నీరు

నెల్లూరు జిల్లాలో వరి నారు మళ్లు, నార్లు దెబ్బతిన్నాయి. సంగం బ్యారేజీకి, సోమశిలకు వరద నీరు వచ్చింది. సోమశిల రెండు గేట్లు ఎత్తి 19.610 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఉదయగిరి, వరికుంటపాడు, కందుకూరు ప్రాంతాల్లో కందులు, పొగాకు, మినుము పంటలు దెబ్బతిన్నాయి. కందుకూరు సబ్ డివిజన్ పరిధిలో సుమారు 2,460 ఎకరాల్లో శనగ పైరుకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. 33 శాతం కన్నా ఎక్కువ నష్టపోయిన రైతులకు సబ్సిడీతో శనగ విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

హైదరాబాద్‌లో ముసురు

తుపాను ప్రభావంతో హైదరాబాద్‌లో ముసురు వాతావరణ నెలకొంది. నగరంలోని పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తున్నాయి. రాగల మూడు రోజులపాటు తెలంగాణలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

కేరళ, కర్ణాటకల్లో ఎల్లో అలర్ట్

మాండూస్ తుపాను కారణంగా కేరళ, కర్ణాటకల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో మూడు రోజులపాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా. కర్ణాటకలోని అనేక జిల్లాల్లో ఆదివారం ఒక మాదిరి నుంచి భారీ వర్షాలు కురిశాయి. శివమొగ్గ, హావేరి, బళ్లారి, చిక్కమగళూరు, చిత్రదుర్గ జిల్లాల్లో మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. తుపాన్ ధాటికి తమిళనాడులో మరొకరు మృతి చెందారు. దీంతో, మృతుల సంఖ్య ఐదుకు చేరింది.



మీ కోసం

గాజులు, క్లిప్స్, గొలుసులకు ఉండే స్టోన్స్ ఊడిపోతున్నప్పుడు ట్రాన్స్పరెంట్ నెయిల్ పాలిష్‌తో అతికించవచ్చు. ట్రాన్స్పరెంట్ లేకపోతే కలర్ నెయిల్ పాలిష్‌తోనైనా అంటించవచ్చు.

జీవన సౌరభం

నీ వెనుకేముంది.. ముందేముంది.. అనేది నీ కనవసరం. నీలో ఏముంది అనేది ముఖ్యం.

ప్రకృతి ఉద్రిక్తత




ఆకాశంలో మేఘాలను చూడండి
నీలి రంగు వర్ణాలతో మూసుకుంది
నీటి బిందువులతో ఆకట్టుకుంది
ఇంద్రధనసుతో వర్ణించుకుంది

చెట్టు సంతోషాన్ని
సహకారంగా చేసుకుంది
నా మదిలో ఉరిమే ఉత్సాహాన్ని
చేకూరుస్తుంది..
ఆకాశాన్ని తాకుతూ
కొండల్లో ఉన్న
గుహలు, గుట్టలు
చెట్లను, పొదలను
మబ్బులతో, ఉరుములతో
వణికిస్తూ సేలయేరుల
ముందుకుపోతూ
ప్రజలను ఆదుకుంటూ
జీవనోపాధి కోసం పోరాడుతూ
జీవితం మీద ఆశను పెట్టుకొని
ముందుకు సాగిపోతూ
ముమ్మాటికి తోడుగా నిలిచిపోతాను..

- గిద్దలూరు సాయి కిషోర్
రాయదుర్గం, అనంతపురం జిల్లా.

తేడాలు గుర్తించండి



పిల్లలూ! ఈ చిత్రంలో ఐదు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ





- అనిక,
4వ తరగతి,
శ్లోక ఇంగ్లీష్ మీడియం స్కూలు,
హైదరాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తొలి అడుగుల బాటలో..

తారసపడ్డ సమస్యలెన్నో..!



'నేను రెండవసారి గర్భం దాల్చినప్పుడు ప్రసూతి సెలవుల నిమిత్తం అధికారులను సంప్రదించినప్పుడు 'మళ్లీనా..' అన్న సమాధానం వచ్చింది. ఆ రోజుల్లో ప్రసూతి సెలవుల నిమిత్తం మూడు నెలలు ఇచ్చేవారు. ఆ సమయంలో నాకు ఆరునెలలు ఇవ్వాల్సిరావడంతో అధికారులు ఆవిధంగా స్పందించారు. ఆ క్షణంలో సెలవులు ఎందుకు తీసుకున్నానా... అని బిడియంతో మాట్లాడలేకపోయాను' అంటున్న వ్యక్తి సాధారణ మహిళ కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా ఐపిఎస్ అధికారిగా చరిత్రలో చెరగని ముద్రవేసిన ఆమె అరుణా బహుగుణ. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు పోలీస్ అధికారిగా సమర్థవంత విధులు నిర్వహించిన ఆమె, పురుషులు మాత్రమే చేయగలరన్న పనుల్లోకి స్త్రీలు ప్రవేశించినప్పుడు ఎదుర్కొనే లింగవివక్షను వివరించారు.

'భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి మూడు దశాబ్దాల కాలం గడిచింది. అప్పుడే పురుషులతో సమానంగా స్త్రీలు వివిధ రంగాల్లోకి అడుగుపెట్టడం మొదలైంది. దేశ తొలి ఐపిఎస్ అధికారి కిరణ్‌బేడీ నుంచి ఓ యువతిగా ఉన్న నేను గొప్ప స్ఫూర్తిపొందాను. నేను కూడా పోలీస్ ఆఫీసర్ కావాలని కలలు కన్నాను'.

నా ప్రయాణంలో స్ఫూర్తివంత మహిళలు..

'పురుషులు మాత్రమే ఉద్యోగం చేయాలి.. స్త్రీలు ఇంట్లోనే కూర్చోవాలి.. ' వంటి సనాతన సాంప్రదాయానికి విరుద్ధంగా తన ఇంట్లోని మహిళలు వివిధ రంగాల్లో రాణించడం ఆమె కళ్లారా చూశారు. అరుణ నాయనమ్మ హైద్రాబాద్ కోటి మహిళా కాలేజీ తొలి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు. '15 ఏళ్ల వయసులో వితంతువుగా మొదలైన నాయనమ్మ తన ఒంటరి ప్రయాణంలో ఎప్పుడూ భయపడలేదు. ఒంటిచేత్తో కొడుకును పెంచి ప్రయోజకుడిని చేసింది. ఇక మా అమ్మ జర్నలిస్టుగా వ్యవహరించేవారు. ఇలా మా ఇంట్లో ఆడవాళ్లు తమ కాళ్లపై తాము నిలబడడం నాకు గొప్ప స్ఫూర్తినిచ్చింది. వారి వల్లే నా చిన్నతనంలోనే నేను కూడా వారిలాగే ఉన్నతంగా ఎదగాలన్న బీజం పడింది' అంటారు.

ఉమ్మడి రాష్ట్రంలో తొలి మహిళా ఐపిఎస్

1979లో ఉమ్మడి ఆంధ్రాకు తొలి మహిళా ఐపిఎస్‌గా విధుల్లో చేరినప్పటి నుండి ఉద్యోగ జీవితంలో ఎన్నో మైలురాళ్లను అధిరోహించారు. 'ఐపిఎస్ శిక్షణ తీసుకునేటప్పుడు మా బ్యాచ్‌లో నేనొక్కదాన్నే మహిళను. శిక్షణకు రాకముందే నేను చాలా వ్యతిరేకతను ఎదుర్కొన్నాను. ఇది పురుషులకు సంబంధించిన పని కదా! మీరెందుకు దీన్ని చేయాలనుకుంటున్నారు అని ఒక ఇంటర్వ్యూలో నన్ను అడిగారు. 1978లో యుపిఎస్‌సి పరీక్షలు రాసి మొదటి సారే ఉత్తీర్ణత సాధించాను. పరీక్ష అయితే పాసయ్యాను కాని శిక్షణ సమయంలో ఒకే మహిళా అభ్యర్థి కావడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. బృందంలో పురుషులు ధరించేవే నేను కూడా వేసుకునేదాన్ని. నా శరీరానికి ఏమాత్రం సరిపడని వాళ్ల సైజు యూనిఫామ్ వేసుకోవాల్సివచ్చేది. షూస్ కూడా నా కాలికి రెండింతల పొడవు వుండేవి. టోపీ నా తలకు సరిపోయేలా ఏదైనా స్టఫ్ పెట్టుకునేదాన్ని' అంటూ నాటి అనుభవాలను పంచుకున్నారు. అరుణ తండ్రి మహారాష్ట్ర కేడర్ ఐఎఎస్‌గా బాధ్యతలు నిర్వహించారు. 'ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించేవారు' అంటూ ఈ సందర్భంగా తండ్రిని గుర్తుచేసుకున్నారు.

> **పోలీసు అధికారిగా గొప్ప ఆదరణ**
>
> యూనిఫాంలో గ్రామాలకు వెళ్తుంటే నన్ను చూసేందుకు జనం వచ్చేవారు. ఓ మహిళ పోలీసు దుస్తులు ధరించడం అప్పుడు పెద్ద విషయం మరి. ఇక అక్కడ మహిళలు ఎదుర్కొనే సమస్యల గురించి నాతో చర్చించేటప్పుడు గ్రామీణుల ఇష్టదైవం 'ఎల్లమ్మ'గా నన్ను పిలిచేవారు. అలా పిలుస్తూ నాతో వారి బాధలు పంచుకునేవారు. నేను కూడా వారు నన్ను ఎలా పిలిచినా అది వారితో మరింత దగ్గరచేస్తుందని నమ్మేదాన్ని. ఆ నమ్మకమే ఎంతోమంది మహిళలు ఎటువంటి భయం లేకుండా తమ బాధలు నాతో పంచుకునేవారు.

శిక్షణ తీసుకుని విధుల్లో చేరిన తరువాత కూడా తన ఇబ్బందులు సమసిపోలేదని చెబుతూ.. 'ఉద్యోగంలో చేరాక మగవాళ్లతో సమానంగా నేను కూడా పనిచేయడం మొదలైంది. మానసికంగా సిద్ధమైనప్పటికీ శారీరకంగా ఎన్నో బాధలు పడ్డాను. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఉండేందుకు వసతి ఇచ్చేవారు కాదు. స్కూలు వరండాల్లో, కుర్చీలో పడుకునేదాన్ని. మరుగుదొడ్లు కూడా ఉండేవి కావు. ఇక నేను ఇప్పటికీ చాలా అవమానంగా భావించే విషయం నేను ప్రసూతి సెలవులు తీసుకోవడం.. రెండుసార్లు గర్భవతిని కావడం వల్ల నాకు ఆరు నెలలు మంజూరు చేయాల్సివచ్చింది. ఇది అధికారుల ముందు నన్ను తలెత్తుకోలేకుండా చేసింది' అంటూ ఆనాటి విషయాన్ని పంచుకున్నారు.



భర్తను కోల్పోయి ఒంటరి మహిళగా..

పెళ్లయి పదేళ్లు కూడా గడవక ముందే భర్త చనిపోవడం అరుణ జీవితంలో పెద్ద కుదుపు. ఈ సంఘటనతో అప్పటికే ఇద్దరు బిడ్డల తల్లైన ఆమె బాధ్యతలు రెట్టింపయ్యాయి. కుటుంబం చాలా మద్దతుగా నిలిచింది. అయినా.. 'నేను ఒంటరి తల్లిని. నేను ఉద్యోగం చేస్తున్నదానితో సంబంధం లేకుండా పిల్లలను చూసుకోవడం నా బాధ్యతగా మాట్లాడేవారు. పోలీసు అధికారిగా ఎప్పుడు డ్యూటీ ఉంటుందో తెలియదు. పిల్లల ఆలనా పాలనా చూసుకోవడం చాలా కష్టంగా అనిపించేది. నా పిల్లలు స్కూలుకు సరిగ్గా వెళ్లేవారు కాదు. చాలా మంది పిల్లలు అలా చేసినా నా పిల్లలు మాత్రం అలా చేయకూడదన్నట్లు ఉండేది వాతావరణం. ఎందుకంటే నేను ఒంటరి తల్లిని. పిల్లలను చూసుకోవాల్సిన తల్లి ఇంటిపట్టున లేకుండా ఉద్యోగమంటూ బయట తిరుగుతుంటే పిల్లలు ఇలాగే తయారవుతారు అనేవారు. ఉద్యోగంలో నన్ను గౌరవించేవారు, మద్దతు ఇచ్చేవారు చాలామందే ఉండేవారు. కాని అప్పుడప్పుడూ ఇలాంటి మాటలు కూడా వినపడేవి' అంటున్న అరుణ పెంపకంపై అనుమానాలు వ్యక్తం చేసిన వారంతా నివ్వెరపోయేలా ఇప్పుడు ఆమె పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

ఉద్యోగ జీవితం..

దాదాపు నాలుగు దశాబ్దాలు సేవలందించిన అరుణ 2017లో పదవీవిరమణ పొందారు. తన కెరీర్‌లో రాష్ట్ర మొదటి ఐపిఎస్ అధికారిగానే కాక, నేషనల్ పోలీస్ అకాడెమీ మొదటి మహిళా డైరెక్టర్‌గా, సిఆర్‌పిఎఫ్ మొదటి మహిళా స్పెషల్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్, విశాఖపట్నం రూరల్ సూపరింటెండ్‌గా విధులు నిర్వర్తించారు.

అవార్డులు.. ప్రశంసలు

ఆమె ప్రతిభావంత సేవకుగాను 1995లో భారత పోలీసు పతకాన్ని అందుకున్నారు. 2005లో రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. ఆమె ఉద్యోగజీవితంలో గొప్ప విజయంగా గృహ బాధితుల కోసం మహిళా రక్షణ సెల్‌ను ప్రారంభించిన అప్పటి ముఖ్యమంత్రి ఆమెను మొదటి అధికారిగా ఎంపికచేయడమని చెబుతారు.

సేవామార్గంలో..

పదవీ విరమణ చేసినప్పటి నుండి ప్రజలకు సేవచేయడంలో ముందుంటున్నారు. కరోనా సమయంలో వలస కార్మికులకు ఆహారం అందించడం, పాదరక్షలు సేకరించి ఇవ్వడం, సొంత ఊళ్లకు పంపించడంలో ఓ స్వచ్ఛంద సంస్థతో కలసి పనిచేశారు. ఆకలితో అలమటిస్తున్న ఆనాటి దృశ్యాలకు చలించిపోయిన అరుణ ప్రస్తుతం హైద్రాబాద్‌లో 'రోటీ బ్యాంక్' నిర్వహిస్తున్నారు. దాని ద్వారా పేద ప్రజలకు ఆహారాన్ని వండడం, ప్యాక్ చేయడం, పంపిణీ చేయడంలో తీరిక లేకుండా గడుపుతున్నారు.

చివరగా..

'మిమ్మల్ని అడ్డుకోవడానికి చాలా మంది వ్యక్తులు ఉంటారు. మీరు దేన్నీ చేయలేరని చెబుతారు. కానీ మీరేమీ పట్టించుకోవద్దు. నా దృష్టిలో ప్రతి స్త్రీ ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలి. అలాగే ప్రపంచాన్ని మెరుగుపరచడంలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలి' అంటున్న అరుణ జీవితం ఎంతోమందికి గొప్ప స్ఫూర్తిదాయకం.

నమ్మించి మోసగించారు

- సొసైటీ భూముల్లో బాధిత ఎస్‌సి, ఎస్‌టి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

అధికారంలోకి వస్తే తమ భూములకు పట్టాలిస్తామని చెప్పిన సిఎం, స్థానిక మంత్రి తమను తీవ్రంగా మోసం చేశారని యడవల్లి రైతులు మండిపడ్డారు. గ్రామ సభలైనా నిర్వహించకుండా తమ భూములను గ్రానైట్ పేరుతో లాక్కున్నారని తెలిపారు. 20వ తేదీలోగా గ్రామ సభలు నిర్వహించకుంటే 21న తమ భూములను తాము సాగు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యడవల్లిలోని సొసైటీ భూముల్లోకి వెళ్లి ఆదివారం ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో రైతలు ఉదయం ఐదు గంటల నుండి 11.30 గంటల వరకూ ఆయా భూముల్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, ఆంధ్ర మాల్యాద్రి, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటూరు విజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ లక్ష్మీశ్వర రెడ్డి తదితరులు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఈ భూములను లాక్కోవాలనుకుంటే రైతులు పోరాడారని గుర్తు చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి.. తాము అధికారంలోకి వస్తే యడవల్లి సొసైటీలోని ప్రతి కుటుంబానికీ మూడెకరాల చొప్పున పట్టాలిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం భూములను బలవంతంగా తీసుకున్నారని తెలిపారు. స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి విడదల రజిని యడవల్లి రైతులను నమ్మించి మోసం చేశారని, భూములు తీసుకునేటప్పుడు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయలేదని అన్నారు. పోలీసుల నిర్బంధం, అధికారుల బెదిరింపులతో భూములన్నీ లాగేసుకున్నారని విమర్శించారు. ఇళ్ల స్థలాల పంపిణీ కోసం సేకరించిన భూమికి ఇదే గ్రామంలో ఎకరాకు రూ.20 లక్షలు ఇచ్చారని, సొసైటీ భూములకు మాత్రం రూ.ఎనిమిది లక్షలతో సరిపెట్టారని తెలిపారు. పరిహారంలోనూ బాధిత రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. భూములన్నింటినీ బాధిత రైతులకు తిరిగి ఇవ్వాలని, లేదా మైనింగ్‌లో వాటా ఇవ్వాలని, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై 20వ తేదీలోగా మళ్లీ గ్రామ సభలు నిర్వహించి న్యాయం చేయాలని, లేకుంటే 21న అదే భూముల్లో సాగును ప్రారంభిస్తామని స్పష్టంచేశారు. అనంతరం పొలాల నుండి గ్రామంలోకి ప్రదర్శనగా వెళ్లారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జి రవిబాబు, రామారావు, పి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, విల్సన్, టి పెద్దిరాజు పాల్గొన్నారు.



యడవల్లి భూముల్లో నుండి గ్రామంలోకి ప్రదర్శనగా వస్తున్న రైతులు, నాయకులు

ఆర్‌బికెలను సందర్శించిన బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్

- పొలంబడి, సేంద్రీయ వ్యవసాయంపై ఆరా

ప్రజాశక్తి కంచికచర్ల

గ్రామ స్థాయిలో వ్యవసాయ సమాచారాన్ని సేకరించి వ్యవసాయాభివృద్ధికి దోహదపడేలా కృషిచేస్తోన్న రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె)ల పనితీరు అభినందనీయమని బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల, నందిగామలో ఆదివారం ఆయన పర్యటించారు. తొలుత కంచికచర్లలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను, అనంతరం ఆర్‌బికె కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనకు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభారతి, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలూ నాయక్, జాయింట్ కలెక్టర్ వి.శ్రీధర్, నందిగామ ఎడిఎ రమణ మూర్తి స్వాగతం పలికారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం వాతావరణ పరిస్థితులను బట్టి సాగు చేసిన పంటలకు చేపట్టాల్సిన చర్యల గురించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి, తద్వారా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. సేంద్రియ వ్యవసాయ విధానం, వ్యవసాయ యాంత్రీకరణ, కూరగాయల సాగు, పూలతోటల పెంపకం, పశుపోషకులకు ప్రభుత్వం అందించే రాయితీలు, ఆక్వా సాగు తదితర వాటి గురించి తెలిపారు. ఈ సందర్భంగా గారెత్ విన్ ఓవెన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయానికి ఇస్తోన్న ప్రాధాన్యత అభినందనీయమన్నారు. గ్రామ స్థాయిలో 1500 మంది రైతుల పూర్తి సమాచారాన్ని ఒకచోటకు తీసుకువచ్చి, రైతులను ప్రోత్సహించేందుకు ఆర్‌బికె కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అందుకు అధునాతన భవనం నిర్మించి, సిబ్బందిని నియమించి వినియోగంలోకి తీసుకురావటం గర్వించదగ్గ విషయమన్నారు. భారత్‌లో పండే వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి పంటలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని తెలిపారు. సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తోన్న కృషి ఎనలేనిదని కొనియాడారు. ఇక్కడి వ్యవసాయ విధానం, ప్రభుత్వం ప్రోత్సాహం, ఆర్‌బికె పనితీరును అధ్యయనం చేసి బ్రిటన్ ప్రభుత్వానికి వివరిస్తానన్నారు.



పొలంబడి కార్యక్రమం గురించి బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్‌కు వివరిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే

అంచనాలకు మించి.. మొరాకో


- ఆఫ్రికా ఖండం నుంచి సెమీస్‌కు చేరిన తొలిజట్టు

ఆఫ్రికా ఖండంలో కేవలం 4కోట్లలోపు జనాభాగల అతి చిన్న దేశమైన మొరాకో జట్టు ఫిఫా ప్రపంచకప్-2022కు అర్హత సాధించడమే గొప్ప అనుకుంటే.. క్వార్టర్‌ఫైనల్లో పోర్చుగల్ జట్టును ఓడించి ఏకంగా సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పెను సంచలనానికి తెరలేపింది. 1970నుంచి ఇప్పటివరకు కేవలం 5సార్లు మాత్రమే ప్రపంచకప్‌కు అర్హత సాధించిన మొరాకో.. 1986లో ఒక్కసారి మినహా ఏనాడూ గ్రూప్ దశను దాటి ఎరుగదు. ఈసారి క్రొయేషియాతో తొలి మ్యాచ్‌ను డ్రా చేసుకున్న మొరాకో... ఆ తర్వాత బెల్జియం, కెనడాలను ఓడించింది. దీంతో గ్రూప్-ఎఫ్‌లో 7పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచి నాకౌట్‌కు చేరి తొలి సంచలనానికి తెరలేపింది. ఇక ప్రి క్వార్టర్స్‌లో స్పెయిన్, కార్వర్‌ఫైనల్లో పోర్చుగల్ వంటి టైటిల్ ఫేవరెట్ జట్లను చిత్తుచేసి సెమీస్‌కు చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా మరో రికార్డును నెలకొల్పింది. మిగతా జట్లతో పోల్చిచూస్తే మొరాకో జట్టుకు మైదానంలో అభిమానులనుంచి లభించే మద్దతు నామమాత్రమే. స్పెయిన్, పోర్చుగల్ జట్లతో జరిగిన మ్యాచ్‌లే ఇందుకు నిదర్శనం. ఆ జట్లకు మైదానంలో 80% మంది అభిమానుల మద్దతు లభిస్తుంటే.. ఆఫ్రికా జట్టుకు లభించింది నామమాత్రపు మద్దతే. అయినా మొరాకో ఈ రెండు జట్లపై గెలిచి ఏకంగా టాప్-4లో నిలిచింది. ఇక సెమీస్‌కు చేరిన క్రొయేషియా 2018లో రన్నరప్‌గా నిలువగా.. అర్జెంటీనా, ఫ్రాన్స్ జట్టు రెండేసిసార్లు టైటిల్‌ను కైవసం చేసుకున్నాయి. పసికూన మొరాకో జట్టు మిగిలిన రెండు మ్యాచుల్లోనూ గెలిచి టైటిల్‌ను ముద్దాడాలని ఆశిద్దాం.. **- స్పోర్ట్స్ డెస్క్**



ప్రపంచకప్‌లో మొరాకో ప్రదర్శన..

తొలి మ్యాచ్	: క్రొయేషియాపై	0-0 (డ్రా)	
రెండో మ్యాచ్	: బెల్జియంపై	2-0(గెలుపు)	
మూడో మ్యాచ్	: కెనడాపై	2-1(గెలుపు)	
ప్రి క్వార్టర్స్	: స్పెయిన్‌పై	0-0(3-0)	(గెలుపు)పెనాల్టీ కిక్స్
క్వార్టర్స్	: పోర్చుగల్‌పై	1-0 (గెలుపు)	



సెమీస్‌కు ఫ్రాన్స్

క్వార్టర్స్‌లో ఇంగ్లండ్‌పై 2-1గోల్స్‌తో గెలుపు

దోహా: డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్‌జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి జరిగిన నాల్గో క్వార్టర్‌ఫైనల్లో 2సార్లు ఫిఫా ప్రపంచకప్ ఛాంపియన్ ఫ్రాన్స్ జట్టు 2-1గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఫ్రాన్స్ తరఫున తొలి గోల్‌ను ఆరిలియన్(17వ ని.) చేయడంతో 1-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇరుజట్లు గోల్‌ను చేయలేకపోయాయి. రెండో అర్ధభాగం 54వ ని.లో ఇంగ్లండ్‌కు పెనాల్టీ కిక్ లభించగా.. స్టార్ ఆటగాడు హర్రీ కేన్ గోల్ కొట్టి 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత ఇరుజట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ క్రమంలో 78వ ని.లో ఓలీవియర్ గిరౌండ్ అద్భుత గోల్ చేసి ఫ్రాన్స్‌కు 2-1 ఆధిక్యతను చేకూర్చాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ ఆటగాళ్లు ఫ్రాన్స్ గోల్‌పోస్ట్‌పై పలుమార్లు దాడులు చేసినా.. ఫ్రాన్స్ డిఫెండర్లు సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు. మ్యాచ్ మొత్తమ్మీద ఇంగ్లండ్ 16సార్లు ఫ్రాన్స్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేయగా.. ఇందులో 8 టార్గెట్ షాట్స్ కొట్టినా ప్రయోజనం లేకపోయింది. అలాగే ఇంగ్లండ్‌జట్టుకు 5 కార్నర్‌షాట్స్ లభించినా గోల్ చేయలేకపోయింది. 15న జరిగే రెండో సెమీస్‌లో ఫ్రాన్స్ జట్టు ఆఫ్రికా ఖండానికి చెందిన మొరాకోతో తలపడనుంది.

సెమీఫైనల్స్: 13న: అర్జెంటీనా × క్రొయేషియా(రా.12.గం॥లకు)
14న: ఫ్రాన్స్ × మొరాకో(రా.12.30గం॥లకు)

పాకిస్తాన్ 198/4

ముల్తాన్: రెండో టెస్ట్‌లో విజయానికి 355పరుగులు చేయాల్సిన పాకిస్తాన్ మూడోరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 198పరుగులు చేసింది. దీంతో పాక్ జట్టు విజయానికి మరో 157పరుగులు చేయాల్సి ఉంది. ఇక మూడోరోజు ఆటలో ఇంగ్లండ్ బ్యాటర్ బ్రూక్(108) సెంచరీతో రాణించగా.. అబ్రార్ అహ్మద్ నాలుగు, జాహిద్ మహమూద్ మూడేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం పాక్ ఓపెనర్లు అబ్దుల్లా(45), రిజ్వాన్(30) తొలి వికెట్‌కు 66 పరుగులు జతచేశారు. కెప్టెన్ బాబర్(1) నిరాశపరిచినా.. షకీల్(54నాటౌట్), ఇమామ్(60) అర్ధసెంచరీలతో మెరిసారు.



ఆస్ట్రేలియా క్లీన్ స్వీప్

రెండో టెస్ట్‌లోనూ విండీస్‌పై గెలుపు

ఆడిలైడ్: రెండో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా గెలిచి 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. వెస్టిండీస్ 496పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆదివారం రెండో ఇన్నింగ్స్ ఆసీస్ బౌలర్ల ధాటికి 77పరుగులకే కుప్పకూలింది. స్టార్క్(3/29), నాసిర్(3/22), బోలండ్(3/16), లియాన్(1/8) సమిష్టిగా బౌలింగ్‌లో మెరిసారు. చంద్రపాల్(17), డి సిల్వ(15) టాప్ స్కోరర్స్. తొలి టెస్ట్‌లో ఆసీస్ 164పరుగుల తేడాతో గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హెడ్‌కు, సిరీస్ లబూషేన్‌కు లభించాయి.

ఆస్ట్రేలియా : 511/7, 199/6డిక్లేర్డ్
వెస్టిండీస్ : 214, 77ఆలౌట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68